A9 NEWS TELANGANA

మన తెలుగు దిన పత్రిక
# ప్రజా గళం

R.NO. T/TG/2026/0111/2018/1268

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక 16 ఆదివారం 10 మే 2026 పేజిలు :08 వెల:రూ.5/-

తల్లి ప్రేమకు ప్రతీకగా మదర్స్ డే



3 లో..

మూసీ పునరుజ్జీవంతో...
# కాలుష్య నియంత్రణపై దృష్టి

ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు
కోర్ అర్బన్ రీజియన్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ
ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి బహుళ ప్రణాళికలు
తెలంగాణ రైజింగ్--2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

**హైదరాబాద్, మే 9 (మన ప్రజాగళం):** ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని నగరాభివృద్ధి ప్రణాళికలను వివరించారు. పెరుగుతున్న నగరీకరణతో





భవిష్యత్తులో మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశముందని పేర్కొన్న ముఖ్యమంత్రి, వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తుగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. హైదరాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు కీలక ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, ఉపరితల రహదారుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.కేవలం రోడ్ల విస్తరణతోనే ట్రాఫిక్ సమస్యలు తగ్గవని, బహుళ రవాణా విధానాలను అభివృద్ధి

మిగతా 2 లో..

మల్కాపూర్ టెర్మినల్‌ను జాతికి
# అంకితం చేయనున్న మోదీ

తెలంగాణ ఇంధన భద్రతకు కీలక ప్రాజెక్టు
రూ. 611 కోట్లతో నిర్మించిన ఆధునిక టెర్మినల్
భారీ నిల్వ సామర్థ్యంతో ఇంధన సరఫరాకు ఊతం

**హైదరాబాద్, మే 9(మన ప్రజాగళం):** తెలంగాణ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా మల్కాపూర్ టెర్మినల్‌ను మే 10న ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రూ. 611 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ అత్యాధునిక టెర్మినల్ రాష్ట్ర భవిష్యత్తు



మిగతా 2 లో..

# ప్రధాని సభ విజయవంతానికి సమాయత్తం కావాలి

బీజేపీ కార్యకర్తలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపు
పరేడ్ గ్రౌండ్స్‌లో రేపు ప్రధాని భారీ బహిరంగ సభ
మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచన
జనసమీకరణలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని



**హైదరాబాద్, మే 9 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రేపు నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులన్నీ సమాయత్తం కావాలని కేంద్ర

మిగతా 2 లో..

# బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు



2 లో..

# ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం



2 లో..

## పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుపై ఉద్యమం తీవ్రం చేస్తాం



2 లో..

# తమిళనాడు ముఖ్యమంత్రిగా రేపు విజయ్ ప్రమాణ స్వీకారం

- టీవీకేకు 120 మంది సభ్యుల మద్దతు
- గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటు
- రాష్ట్రవ్యాప్తంగా అభిమానుల సంబరాలు

**చెన్నై, మే 9 (మన ప్రజాగళం):** తమిళ రాజకీయాల్లో కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్ తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు మార్గం సుగమమైంది. రేపు మధ్యాహ్నం 3 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈరోజు జరిగిన కీలక రాజకీయ పరిణామాల మధ్య విజయ్ చెన్నైలోని లోక్ భవన్‌లో ఇన్‌చార్జ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ .



మిగతా 2 లో..

## శ్యామ ప్రసాద్ ముఖర్జీ కలలను సాకారం చేస్తాం: మోదీ



2 లో..

విలేఖరులు కావలెను...

విశేష ఆదరణతో దూసుకుపోతున్న తెలుగు దినపత్రిక "మన ప్రజాగళం" పత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు, మండలల్లా వారీగా.మరియు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా స్టాఫర్లు కావాలెను.

వివరాలకు సంప్రదించవలసిన పోన్ నెంబరు.
9390 875876

హైదరాబాద్‌ను వణికిస్తున్న
# నేపాలీ ముఠాలు

- పనిమనుషుల పేరుతో ఇళ్లలోకి ప్రవేశం
- జూబ్లీహిల్స్, నందగిరి హిల్స్‌లో వరుస హత్యలు, దోపిడీలు
- 'ఆపరేషన్ నేపాల్'తో రంగంలోకి దిగిన పోలీసులు

**హైదరాబాద్, మే 9 (మన ప్రజాగళం):** హైదరాబాద్‌లోని సంపన్న ప్రాంతాలు జూబ్లీహిల్స్, నందగిరి హిల్స్‌లో వరుసగా జరుగుతున్న హత్యలు, భారీ దోపిడీలు నగర ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. పనిమనుషుల రూపంలో ఇళ్లలోకి ప్రవేశిస్తున్న కొందరు నేపాలీ ముఠాలు విశ్వాసానికి వెన్నుపోటు పొడుస్తూ పక్కా ప్రణాళికలతో నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గత మూడు నెలల్లో చోటుచేసుకున్న మూడు ప్రధాన ఘటనలు నగరంలో తీవ్ర కలకలం రేపాయి. ఫిబ్రవరి 6న నందగిరి హిల్స్‌లో ఓ వ్యాపారి ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ యువకుడు ఇతర పనివారికి మత్తుమందు ఇచ్చి దాదాపు రూ. 2 కోట్ల విలువైన బంగారు ఆభరణాలతో పరారయ్యాడు. మార్చి 14న జూబ్లీహిల్స్‌లో మరో వ్యాపారి ఇంట్లో పనిచేస్తున్న ఇద్దరు నేపాలీలు యజమాని లేని సమయంలో లాకర్లు పగులగొట్టి రూ. 3 కోట్ల విలువైన నగలను దోచుకెళ్లారు. తాజాగా మే 8న ఓ విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంట్లో పనిచేస్తున్న



# ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం

**బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ఘన కార్యక్రమం**
**మోదీ సమక్షంలో బాధ్యతలు చేపట్టిన సువేందు**
**మమతా ఆధిపత్యానికి ముగింపు పలికిన ఎన్నికలు**



**కోల్‌కతా, మే 9 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చారిత్రాత్మక మలుపు చోటుచేసుకుంది. భారతీయ జనతా పార్టీ తరఫున తొలి ముఖ్యమంత్రిగా సువేందు అధికారి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. స్వాతంత్ర్యం తర్వాత బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నేతలు హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందే భారీగా పార్టీ కార్యకర్తలు, ప్రజలు అక్కడికి చేరుకున్నారు. బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైందంటూ బీజేపీ నేతలు వ్యాఖ్యానించారు.ప్రమాణ స్వీకారం అనంతరం సువేందు అధికారి ప్రధానమంత్రి మోదీ ఆశీస్సులు తీసుకున్నారు. వేదికపై ఉన్న జాతీయ నాయకులతో కరచాలనం చేశారు. బెంగాల్ అభివృద్ధి, పరిపాలనలో కొత్త దిశగా ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 294 స్థానాల్లో 207 స్థానాలు గెలుచుకుని ఘన విజయం సాధించింది. పదిహేనేళ్లుగా కొనసాగుతున్న తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ఈ ఎన్నికలు ముగింపు పలికాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆధిపత్యానికి గండి పడడంతో బెంగాల్ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. సువేందు అధికారి ప్రస్తుతం బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొమ్మిదో వ్యక్తిగా నిలిచారు. ఆయన వయస్సు 55 సంవత్సరాలు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయనకు గట్టి పట్టు ఉంది. ఆయన తండ్రి సిసిర్ అధికారి గతంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. విద్యార్థి దశలో కాంగ్రెస్ విద్యార్థి విభాగం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన సువేందు, అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో కీలక నేతగా ఎదిగారు. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సువేందు అధికారి తర్వాత కాలంలో ఆమెకు ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా మారారు. నందిగ్రామ్ రాజకీయాల్లో ఆయన ప్రాధాన్యం మరింత పెరిగింది. రెండు సార్లు మమతాపై పోటీ చేసి విజయం సాధించిన ఆయన ఇప్పుడు రాష్ట్ర అత్యున్నత పదవిని అధిరోహించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మా

# పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుపై ఉద్యమం తీవ్రం చేస్తాం

**దసరా లోపు పనులు ప్రారంభించకపోతే పాదయాత్ర చేపడతామని హెచ్చరిక**
**సాగునీటి సాధన కోసం తెలంగాణ రక్షణ సేన పోరాట పిలుపు**
**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**
**మహిళలు, యువతకు పెట్టుబడి సహాయం అందిస్తామని కవిత హామీ**

**షాద్‌నగర్, మే 9 (మన ప్రజాగళం):** పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో పురోగతి లేకపోవడంపై తెలంగాణ రక్షణ సేన తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జోగులాంబ అమ్మవారి ఆశీస్సులతో పాలమూరు, రంగారెడ్డి ప్రాంత ప్రజలతో కలిసి సాగునీటి సాధన కోసం పోరాటానికి శ్రీకారం చుట్టినట్లు కల్వకుంట్ల కవిత తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని చౌదరిగూడెం మండలం లక్ష్మీదేవిపల్లిలో నిర్వహించిన పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో నేతలు మాట్లాడారు. కృష్ణానది సమీపంలో ప్రవహిస్తున్నప్పటికీ ఆ నీటిని వినియోగించుకునే అవకాశం లేకుండా పాలకులు వ్యవహరించారని విమర్శించారు. సాగునీటి హక్కుల కోసం ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ రైతులకు ఆశించిన స్థాయిలో నీరు అందలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో కూడా ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి పురోగతి చూపలేదని మండిపడ్డారు. పాలమూరు ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఇక సహించబోమని తెలిపారు.లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను దసరా పండుగలోపు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గడువు విధించారు. ఆలోపు పనులు ప్రారంభించకపోతే ప్రాజెక్టు పరిధిలో విస్తృత పాదయాత్ర చేపట్టి ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలు, యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావడానికి పెట్టుబడి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

సభలో పలువురు నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సాగునీటి సమస్య పరిష్కారం వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

# మల్కాపూర్ టెర్మినల్‌ను జాతికి అంకితం చేయనున్న మోదీ




(మొదటి పేజీ తరువాయి..)

ఇంధన అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించనుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సుమారు 89 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మల్కాపూర్ టెర్మినల్‌లో మొత్తం 1 లక్ష 65 వేల కిలోలీటర్ల ఇంధన నిల్వ సామర్థ్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇందులో 60 వేల కిలోలీటర్ల పెట్రోల్, 68 వేల కిలోలీటర్ల డీజిల్, 26 వేల కిలోలీటర్ల విమాన ఇంధనం, 11 వేల కిలోలీటర్ల ఇతర ఇంధన నిల్వ సదుపాయాలు ఉన్నాయని వివరించారు.ఇంధన రవాణాను వేగవంతం చేయడానికి బాటమ్ లోడింగ్ వ్యవస్థతో కూడిన ఆధునిక లోడింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టెర్మినల్ ద్వారా రాష్ట్రంలో ఇంధన సరఫరా మరింత సమర్థవంతంగా మారుతుందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర పారిశ్రామిక, రవాణా రంగాలకు ఈ ప్రాజెక్టు పెద్ద ఊతం ఇస్తుందని బీజేపీ నాయకులు అభిప్రాయపడ్డారు. పెరుగుతున్న ఇంధన అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని టెర్మినల్‌ను నిర్మించినట్లు తెలిపారు. మల్కాపూర్ టెర్మినల్ ప్రారంభంతో తెలంగాణలో ఇంధన నిల్వ, పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం కానుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# శ్యామ ప్రసాద్ ముఖర్జీ కలలను సాకారం చేస్తాం: మోదీ



**కోల్‌కతా, మే 9 (మన ప్రజాగళం):** పశ్చిమ బెంగాల్‌లో తొలి బీజేపీ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకోవడం సహజమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆయన కలలను సాకారం చేయడానికి ఎలాంటి ప్రయత్నాన్నీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. కోల్‌కతాలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మఖన్‌లాల్ సర్కార్‌ను కలిసినట్లు మోదీ తెలిపారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీతో కలిసి పనిచేసిన మఖన్‌లాల్ సర్కార్ జమ్మూ కాశ్మీర్ ఉద్యమ సమయంలో అరెస్టు కూడా అయ్యారని గుర్తు చేశారు.పశ్చిమ బెంగాల్ అంతటా బీజేపీ పార్టీ బలోపేతానికి మఖన్‌లాల్ సర్కార్ జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను పార్టీతో అనుసంధానం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రజల మధ్య పనిచేసిన ఇలాంటి నాయకులు బీజేపీకి స్ఫూర్తిగా నిలుస్తారని మోదీ అన్నారు. కార్యకర్తల అంకితభావం వల్లే పార్టీ ప్రజల్లో మరింత బలపడుతోందని అభిప్రాయపడ్డారు.పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటాన్ని పార్టీ శ్రేణులు చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, సుశాసనం లక్ష్యంగా కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని బీజేపీ నాయకత్వం వెల్లడిస్తోంది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. బెంగాల్ రాజకీయాల్లో ఈ పరిణామం కొత్త మార్పులకు దారితీస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# హైదరాబాద్‌ను వణికిస్తున్న నేపాలీ ముఠాలు

(మొదటి పేజీ తరువాయి..)

నేపాలీ యువతి యజమాని భార్యను హత్య చేసి నగదు, నగలతో పరారైన ఘటన మరింత సంచలనం సృష్టించింది. ఈ మూడు ఘటనల వెనుక ఒకే ముఠా పని తీరు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.ముందుగా ధనిక కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని పనివాళ్లుగా ఇళ్లలో చేరుతున్న నిందితులు, కొద్ది రోజుల పాటు నమ్మకంగా పనిచేస్తూ ఇంట్లోని పరిస్థితులు, నగదు, నగలు ఎక్కడ దాచారన్న సమాచారాన్ని సేకరిస్తున్నట్లు విచారణలో తేలింది. యజమానులు ఊరికి వెళ్లిన సమయంలో లేదా ఏమరపాటుగా ఉన్న సమయంలో తమ అనుచరులతో కలిసి దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుల్లో అరెస్టయిన నిందితుల విచారణలో నేపాల్‌లో ఉన్న కొందరు మాస్టర్‌మైండ్‌ల పాత్ర బయటపడినట్లు సమాచారం. పనికి వెళ్లే వ్యక్తులను ఎంపిక చేయడం నుంచి దోపిడీ తర్వాత ఎలా తప్పించుకోవాలో వరకు అక్కడి నుంచే మార్గనిర్దేశం చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.దోపిడీల అనంతరం పుణె, ముంబై వంటి నగరాలను తాత్కాలిక ఆశ్రయాలుగా వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో నగరాన్ని వణికించిన ముఖియా గ్యాంగ్ తరహాలోనే ఇప్పుడు ఈ నేపాలీ ముఠాలు కూడా పోలీసులకు కొత్త సవాలుగా మారాయి. ఈ ఘటనల నేపథ్యంలో నగర పోలీసులు 'ఆపరేషన్ నేపాల్' పేరుతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు రాష్ట్రాల మధ్య సమన్వయంతో చర్యలు కొనసాగిస్తున్నారు.

# మూసీ పునరుజ్జీవంతో... కాలుష్య నియంత్రణపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి..)

చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. నగరంలో పార్కింగ్ సమస్యలను తగ్గించేందుకు మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేయడానికి ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రాన్ని సీఐయూఆర్, పీఐయూఆర్, ఆర్ఏఆర్ఈ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని తయారీ రంగ అభివృద్ధికి అనుకూల ప్రాంతంగా, ఆ తర్వాతి గ్రామీణ ప్రాంతాలను వ్యవసాయ ఆధారిత ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌ను కాలుష్య సమస్యల నుంచి కాపాడటంతో పాటు నగర సంస్కృతితో అనుసంధానం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. నగరంలో ఈవీ బస్సులను ప్రవేశపెట్టడమే కాకుండా ఆటోలను ఉచితంగా ఈవీ వాహనాలుగా మార్చే కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో హైదరాబాద్ తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవం వంటి అంశాలపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు దేశంలోనే విప్లవాత్మక కార్యక్రమమని స్టాండింగ్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రైజింగ్--2047 విజన్ డాక్యుమెంట్‌ను కమిటీ సభ్యులకు ముఖ్యమంత్రి అందజేశారు.

# ప్రధాని సభ విజయవంతానికి సమాయత్తం కావాలి



(మొదటి పేజీ తరువాయి..)

మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానికి అపూర్వ స్వాగతం పలికేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కిషన్ రెడ్డి సూచించారు. "దేశం కోసం మోదీ -- మోదీ కోసం మనం" అనే స్ఫూర్తితో పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని పేర్కొన్నారు. సభ విజయవంతానికి కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రధానంగా మహిళలు, యువత, విద్యార్థులు భారీ సంఖ్యలో సభకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని నాయకులకు సూచించారు. ప్రజల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి కార్యకర్త జనసమీకరణలో క్రియాశీలక భాగస్వామిగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ప్రధాని సభ రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనున్న నేపథ్యంలో బీజేపీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. పరేడ్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే సభా వేదిక, భద్రతా ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. సభకు రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ నిర్వహణపై పలు అంశాలను చర్చించారు. సభను విజయవంతం చేయడానికి జిల్లా స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ప్రధాని సభ ద్వారా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని బీజేపీ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు నాయకులు తెలిపారు.

# బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు

**- పరస్పరం పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు**
**- బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ భగీరథ్ ఆరోపణ**
**- అసభ్య ప్రవర్తనపై బాలిక ఫిర్యాదు**

**హైదరాబాద్, మే 9 (మన ప్రజాగళం):** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు భగీరథ్, ఓ బాలిక పరస్పరం పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకోవడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఇరుపక్షాల ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొంతమంది స్నేహితుల ద్వారా పరిచయమైన బాలిక డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తూ మానసికంగా వేధిస్తోందంటూ భగీరథ్ కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులపై కూడా ఫిర్యాదులో ఆరోపణలు చేసినట్లు సమాచారం.భగీరథ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించారు. మరోవైపు అదే రోజు రాత్రి బాలిక మల్కాజ్‌గిరి జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై ఫిర్యాదు చేసింది. గత డిసెంబర్ 31న మొయినాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భగీరథ్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక ఆరోపించింది. స్నేహితులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొంది.బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇరుపక్షాల ఆరోపణల నేపథ్యంలో ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు నమోదు చేయడంతో పాటు ఘటన జరిగిన ప్రదేశానికి సంబంధించిన ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన అంశాలపై పోలీసులు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# తమిళనాడు ముఖ్యమంత్రిగా రేపు విజయ్ ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి..)



తమిళనాడు ముఖ్యమంత్రిగా రేపు విజయ్ ప్రమాణ స్వీకారంఆర్లేకర్ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 120 మంది సభ్యుల మద్దతు తనకు ఉందని పేర్కొంటూ ంబంధిత మద్దతు లేఖలను గవర్నర్‌కు సమర్పించారు.విజయ్‌తో సమావేశం కోసం గవర్నర్ తన కేరళ పర్యటనను రద్దు చేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విజయ్ గవర్నర్‌ను కలవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలు ఉండగా ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం టీవీకే బలం 120కి చేరడంతో విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయమైంది. ఇవాళ వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు కూడా టీవీకేకు మద్దతు ప్రకటించాయి.విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించనున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా టీవీకే శ్రేణులు, అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. పలుచోట్ల బాణసంచా కాలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ రంగంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే విజయ్ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం తమిళ రాజకీయాల్లో పెద్ద చర్చగా మారింది. రేపటి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి

# సంపాదకీయం

## తల్లి ప్రేమకు ప్రతీకగా మదర్స్ డే

**అమ్మ త్యాగాలను గుర్తు చేసుకునే ప్రత్యేక రోజు**

**కుటుంబ బంధాలను మరింత బలపరిచే వేడుక**

**ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహణ**



మనిషి జీవితంలో ఎప్పటికీ మారని బంధం తల్లి బంధం. ఒక బిడ్డ ఈ ప్రపంచంలోకి రాకముందే తన ప్రేమను పంచడం ప్రారంభించే వ్యక్తి తల్లే. పిల్లల కోసం తన జీవితాన్ని అంకితం చేస్తూ, వారి ఆనందాన్ని తన ఆనందంగా భావించే అమ్మ గొప్పతనాన్ని గుర్తు చేసుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే నెల రెండో ఆదివారం "మదర్స్ డే"గా జరుపుకుంటారు. ఈసారి మే 10న ఈ ప్రత్యేక రోజు వచ్చింది. తల్లి ప్రేమ, ఆమె త్యాగాలు, కుటుంబం కోసం చేసిన సేవలను స్మరించుకునే సందర్భంగా ఈ రోజును ఎంతో భావోద్వేగంగా నిర్వహిస్తున్నారు. తల్లి అనేది కేవలం ఒక సంబంధం మాత్రమే కాదు, అది ఒక అపారమైన భావోద్వేగం. బిడ్డ చిన్ననాటి నుంచి పెద్దవాడయ్యే వరకు ప్రతి అడుగులోనూ తల్లి పాత్ర కీలకంగా ఉంటుంది. పిల్లల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తు కోసం ఎన్నో కష్టాలను భరిస్తూ కుటుంబానికి అండగా నిలుస్తుంది. రాత్రింబవళ్లు కష్టపడుతూ పిల్లల ముఖంలో చిరునవ్వు చూడటమే తన లక్ష్యంగా భావించే అమ్మ ప్రేమకు ఎలాంటి ప్రతిఫలం ఉండదని పెద్దలు చెబుతుంటారు.

మదర్స్ డే సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ తల్లులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ బహుమతులు అందిస్తున్నారు. కొందరు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటే, మరికొందరు అమ్మతో కలిసి సమయం గడుపుతూ ఆమెను ఆనందింపజేస్తున్నారు. సోషల్ మీడియా వేదికల్లో కూడా తల్లులతో ఉన్న జ్ఞాపకాలను పంచుకుంటూ భావోద్వేగ సందేశాలు పోస్టు చేస్తున్నారు.

పాఠశాలలు, కళాశాలలు కూడా మదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులతో పాటలు, నృత్యాలు, ప్రసంగాలు చేయిస్తూ తల్లి గొప్పతనాన్ని తెలియజేస్తున్నారు. కొన్నిచోట్ల తల్లులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి సేవలను గుర్తిస్తున్నారు. చిన్నారులు తమ చేతులతో తయారు చేసిన గ్రీటింగ్ కార్డులు ఇచ్చి తల్లుల పట్ల ప్రేమను వ్యక్తం చేస్తున్నారు.

నేటి కాలంలో ఉద్యోగాలు, వ్యాపారాలు, సాంకేతిక జీవనశైలి కారణంగా కుటుంబ సభ్యులతో గడిపే సమయం తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మదర్స్ డే కుటుంబ బంధాలను మరింత దగ్గర చేసే సందర్భంగా మారుతోంది. పిల్లలు తమ తల్లులతో గడిపే ప్రతి క్షణాన్ని గుర్తు చేసుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ రోజు కుటుంబాల్లో ఆనందాన్ని తీసుకువస్తోంది. తల్లి చేసే త్యాగాలకు కొలమానం ఉండదు. పిల్లలు అనారోగ్యానికి గురైతే తల్లి పడే ఆందోళన, వారి విజయాల్లో ఆమె పొందే ఆనందం, వారి బాధల్లో తాను కూడా కుంగిపోవడం వంటి భావాలు తల్లి ప్రేమను మరింత గొప్పగా నిలబెడతాయి. తన పిల్లల కోసం ఎన్నో కలలను త్యాగం చేస్తూ వారికి మంచి భవిష్యత్తు ఇవ్వడమే అమ్మ లక్ష్యంగా ఉంటుంది.

ప్రస్తుతం సమాజంలో వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. తమను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను కొందరు నిర్లక్ష్యం చేస్తున్న ఘటనలు కూడా కనిపిస్తున్నాయి. మదర్స్ డే సందర్భంగా తల్లిదండ్రుల పట్ల గౌరవం చూపించాలని, వారిని ప్రేమగా చూసుకోవాలని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న తల్లులకు పిల్లల ఆదరణ ఎంతో అవసరమని చెబుతున్నారు. మదర్స్ డే చరిత్రను పరిశీలిస్తే అమెరికాలోనే ఈ సంప్రదాయం ప్రారంభమైంది. తల్లుల సేవలను గౌరవించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన ఈ ప్రత్యేక రోజు తర్వాత ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ప్రస్తుతం అనేక దేశాలు ఈ రోజును ఎంతో ఘనంగా జరుపుకుంటున్నాయి. భారతదేశంలో కూడా గత కొన్నేళ్లుగా మదర్స్ డే వేడుకలు విస్తృతంగా జరుగుతున్నాయి.

వైద్యులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రైతులు ఇలా ప్రతి రంగంలోనూ ఉన్న మహిళలు తల్లులుగా కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఉద్యోగ జీవితంతో పాటు కుటుంబాన్ని చూసుకోవడం అనేది ఎంతో కష్టమైన పని అయినప్పటికీ తల్లులు దాన్ని చిరునవ్వుతో నిర్వహిస్తున్నారు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉండటంలో తల్లి పాత్ర ఎంతో ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. మదర్స్ డే అనేది కేవలం ఒక రోజు మాత్రమే కాదు. ప్రతి రోజూ తల్లిని గౌరవించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని గుర్తు చేసే సందర్భం. అమ్మ ప్రేమకు విలువ కట్టలేమని, ఆమె చేసిన సేవలకు జీవితాంతం రుణపడి ఉంటామని చాలా మంది భావోద్వేగంగా చెబుతున్నారు. తల్లి ఉన్న ఇల్లు స్వర్గంతో సమానమని పెద్దలు చెప్పిన మాటలను మరోసారి గుర్తు చేస్తూ మదర్స్ డే ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆనందం, అనుబంధాలను మరింత పెంచుతోంది.

## మూసీలో పడిపోయిన మహిళకు ప్రాణదాతగా హైడ్రా

**సమాచారం అందిన 16 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకున్న డీఆర్ఎఫ్ బృందం**

**రాత్రంతా మూసీలోనే భయంతో గడిపిన మహిళ**

**నిచ్చెన సాయంతో సాహసోపేతంగా రక్షించిన సిబ్బంది**

**హైడ్రా సిబ్బందిపై స్థానికుల ప్రశంసలు**

**హైదరాబాద్, మే 9(మన ప్రజాగళం):**



అంబర్‌పేట్ పరిధిలోని గోల్నాక సమీపంలో మూసీలో పడిపోయి ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్న మహిళను హైడ్రా డీఆర్ఎఫ్ బృందం సాహసోపేతంగా రక్షించింది. సమాచారం అందిన కొద్ది నిమిషాల్లోనే ఘటనాస్థలానికి చేరుకున్న సిబ్బంది సమయస్ఫూర్తితో స్పందించి మహిళ ప్రాణాలను కాపాడారు. భాగ్యనగర్ ప్రాంతానికి చెందిన ఇందిర అనే మహిళ శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు మూసీలో జారి పడినట్లు అధికారులు తెలిపారు. ఆమె పడిపోయిన ప్రాంతం ఒడ్డుకు చేరుకునే అవకాశం లేని ప్రదేశంగా ఉండటంతో పాటు చెట్లు అడ్డుగా ఉండడంతో బయటకు రావడం సాధ్యపడలేదు. రాత్రంతా మూసీలోనే ప్రాణభయంతో గడిపిన ఆమె కేకలు వేసినా ఎవరికీ వినిపించలేదని సమాచారం. శనివారం ఉదయం స్థానికులు మహిళను గుర్తించి బయటకు తీసేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. దీంతో హైడ్రా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఉదయం 10 గంటల 51 నిమిషాలకు సమాచారం అందుకోగా, 11 గంటల 7 నిమిషాలకు డీఆర్ఎఫ్ బృందం ఘటనాస్థలానికి చేరుకుంది. రెస్క్యూ ఇంచార్జి స్వామి ఆధ్వర్యంలోని బృందం అంబర్‌పేట్ టీమ్‌తో కలిసి సహాయక చర్యలు ప్రారంభించింది. హైడ్రా సిబ్బంది రక్షణ చర్యలు కొనసాగిస్తున్న సమయంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది కూడా అక్కడకు చేరుకున్నారు. పెద్ద నిచ్చెన సాయంతో డీఆర్ఎఫ్ సభ్యులు మూసీలోకి దిగిపోయి ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న మహిళను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులు, స్థానిక పోలీసులకు అప్పగించారు. తాను ప్రమాదవశాత్తు జారి పడిపోయినట్లు మహిళ తెలిపింది. భర్త లేరని, ఇద్దరు పిల్లలతో అక్కడే నివసిస్తున్నట్లు పేర్కొంది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో వేగంగా స్పందించి మహిళను కాపాడిన హైడ్రా సిబ్బందిని స్థానికులు అభినందించారు. మూసీ పరిసర ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందిస్తున్న హైడ్రా డీఆర్ఎఫ్ బృందం సేవలు ప్రశంసనీయమని ప్రజలు పేర్కొన్నారు.

# మోదీకి కవిత బహిరంగ లేఖ

- తెలంగాణ ప్రయోజనాలపై నాలుగు కీలక డిమాండ్లు
- పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కోరిన కవిత
- ఓబీసీ హక్కులు, మహిళా రిజర్వేషన్‌పై విజ్ఞప్తి



**హైదరాబాద్, మే 9(మన ప్రజాగళం):**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, దేశంలో సామాజిక న్యాయ సాధనకు సంబంధించిన నాలుగు కీలక అంశాలను తక్షణమే పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే భారీ బహిరంగ సభకు ముందు రాసిన ఈ లేఖలో తెలంగాణ ప్రజలకు, దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం సాధనకు అత్యంత కీలకమైన అంశాలను ఒక బాధ్యతగల పౌరురాలిగా ప్రధానమంత్రి దృష్టికి తీసుకువస్తున్నానని కవిత పేర్కొన్నారు. పాలమూరు-- రంగారెడ్డి ఎత్తిపోతల నీటి పారుదల పథకానికి జాతీయ హోదా కల్పించాలని ఆమె ప్రధానంగా డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా దక్షిణ తెలంగాణలో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, ప్రాంత అభివృద్ధికి ఇది ఎంతో కీలకమని వివరించారు. అదేవిధంగా 2027 జనాభా లెక్కలలో ప్రత్యేక ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా వెనుకబడిన తరగతుల అసలు జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు వెలుగులోకి రావాలంటే కులగణన అవసరమని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఓబీసీ ఉపకోటాతో తిరిగి ప్రవేశపెట్టాలని కూడా కవిత కోరారు. మహిళా సాధికారతతో పాటు వెనుకబడిన వర్గాల మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలంటే ఓబీసీ ఉపకోటా అవసరమని అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో వెనుకబడిన తరగతులకు సంబంధించిన బిల్లులపై రాష్ట్రపతి ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా లేఖలో విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం అమలులో ఆలస్యం జరగకూడదని పేర్కొన్నారు. జల భద్రత, డేటా ఆధారిత న్యాయం, లింగ సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణలు అనే నాలుగు మూలస్తంభాలను బలోపేతం చేయడం ద్వారా దేశ సమాఖ్య స్ఫూర్తి మరింత బలపడుతుందని కవిత అభిప్రాయపడ్డారు. తాను ప్రస్తావించిన అంశాలపై ప్రధానమంత్రి సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని కోరారు.

# కరీంనగర్ బంద్ ఉద్రిక్తం.. గంగుల కమలాకర్ అరెస్ట్

**క్యాంప్ కార్యాలయంపై దాడికి నిరసనగా బంద్**

**ఇంటి వద్ద నుంచే మాజీ మంత్రిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**పలువురు బీఆర్ఎస్ నేతల అరెస్ట్**



**కరీంనగర్, మే 9 (మన ప్రజాగళం):**

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన కరీంనగర్ బంద్ కొనసాగుతోంది. నగరంలో పలు ప్రాంతాల్లో బంద్ ప్రభావం కనిపించింది. బీజేపీ గూండాలు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గంగుల కమలాకర్ నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. అనంతరం ఆయన్ను ఇంటి వద్ద నుంచే అదుపులోకి తీసుకుని ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంగుల కమలాకర్‌తో పాటు మాజీ మేయర్ రవీందర్ సింగ్, ఏనుగు రవీందర్ రెడ్డి సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను కూడా పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. అరెస్టులకు నిరసనగా పార్టీ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు. నగరంలో శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రశాంతంగా బంద్ నిర్వహిస్తున్నప్పటికీ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని మండిపడ్డారు. ఇదిలా ఉండగా నగరంలో పలు దుకాణాలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేయబడ్డాయి. బంద్ నేపథ్యంలో రవాణా కూడా కొంత మేర ప్రభావితమైంది. పోలీసులు పరిస్థితిని అదుపులో ఉంచేందుకు చర్యలు కొనసాగిస్తున్నారు.

# రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోంది: హరీశ్ రావు

**కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలపై తీవ్ర ఆగ్రహం**

**సన్ ఫ్లవర్, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యమని విమర్శ**

**తరుగులు, బీ-గ్రేడ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారన్న ఆరోపణ**



**సిద్దిపేట, మే 9(మన ప్రజాగళం):**

సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన సన్ ఫ్లవర్, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో 40 రోజులుగా పడిగాపులు కాస్తున్న రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రైతుల పరిస్థితిని చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు, వడగండ్ల వానలతో రైతులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని హరీశ్ రావు మండిపడ్డారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా వారాల తరబడి కేంద్రాల వద్దే ఉండాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. రైతుల బాధలపై ప్రభుత్వానికి కనీస స్పందన లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లపై ఒక్క సమీక్ష సమావేశం కూడా నిర్వహించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వరి కోతలు ప్రారంభమయ్యే ముందే మంత్రులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి సంచులు, లారీలు, నిధులు సిద్ధం చేసేవారని గుర్తు చేశారు. రైతులను కంటికి రెప్పలా కాపాడిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. చిన్నకోడూరు ప్రాంతంలో రైతులు ఎకరాకు 9 నుంచి 10 క్వింటాళ్ల సన్ ఫ్లవర్ దిగుబడి సాధిస్తున్నప్పటికీ కేవలం ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం నిబంధన పెట్టిందని విమర్శించారు. తీరా ఆ పరిమితి మేరకు కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ కోటా ముగిసిందనే కారణాలు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

పొద్దున్న లేస్తే పంటల మార్పిడి చేయాలని రైతులకు సూచించే ప్రభుత్వం, రైతులు సన్ ఫ్లవర్, మక్కలు, శనగలు, జొన్నలు పండిస్తే వాటిని ఎందుకు కొనుగోలు చేయడం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవైపు పంటల మార్పిడి చేయమని చెప్పి, మరోవైపు ఆ పంటలను కొనకుండా రైతులను నష్టాల్లోకి నెట్టడం ద్వంద్వ వైఖరి కాదా అని విమర్శించారు. జొన్న పంటను గతంలో ప్రతి ఏడాది కొనుగోలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం జొన్నలు కొనడం లేదని, సన్ ఫ్లవర్ కొనుగోళ్లు పూర్తిగా ఆపేసిందని ఆరోపించారు. మక్కలకు కూడా పరిమితులు విధించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. సంచులు కూడా రైతులే తెచ్చుకోవాలని చెప్పడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని హరీశ్ రావు విమర్శించారు. రైతులకు సంచులు సరఫరా చేసే సామర్థ్యం లేని ప్రభుత్వం ఢిల్లీ పర్యటనలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా ఒక్కసారి కూడా రైతుల వద్దకు వెళ్లి వారి బాధలు వినలేదని అన్నారు. వడ్లను రైస్ మిల్లులు తీసుకోవడం లేదని, కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు కిలో తరుగు వేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. బీ-గ్రేడ్ పేరుతో ఎకరాకు వందల రూపాయల నష్టం వస్తోందన్నారు. ఒకవైపు తరుగులు, మరోవైపు మిల్లుల్లో కటింగ్స్‌తో రైతులు పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పారని హరీశ్ రావు విమర్శించారు. బోనస్ ఎగ్గొట్టడమే కాకుండా తరుగులు, బీ-గ్రేడ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. చిన్నకోడూరులో సన్ ఫ్లవర్ కొనుగోళ్లు నిలిపివేయడంతో కుప్పల కింద పంట చెడిపోతోందన్నారు. మద్దతు ధర రూ. 7,720 ఉండగా ప్రైవేట్ వ్యాపారులు రూ. 5 వేలకే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీంతో రైతులు ఎకరాకు వేల రూపాయలు నష్టపోతున్నారని చెప్పారు. రైతుబంధు లేక, మద్దతు ధర అందక రైతులు అప్పుల పాలవుతున్నారని మండిపడ్డారు. సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో గత నాలుగు రోజులుగా నిల్వలు పేరుకుపోయి లారీలు లేక పంటలను లోపలికి అనుమతించడం లేదని హరీశ్ రావు అన్నారు. ఒక రైతు పంట అమ్ముకోవాలంటే తేమ పరీక్షకు వారం, సంచుల కోసం వారం, కాంటాకు వారం, లారీల కోసం వారం ఇలా నెల రోజుల పాటు కల్లాల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. రైతులను ఆదుకోని ప్రభుత్వం ప్రజల నమ్మకం కోల్పోతుందని హరీశ్ రావు హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



# బీజేపీని ఓడించేందుకు విపక్షాలన్నీ ఏకం కావాలి

- మమత పిలుపు
- బీజేపీయే తొలి శత్రువని వ్యాఖ్య
- విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు పిలుపు
- బంగాల్‌లో టీఎంసీ కార్యకర్తలపై దాడుల ఆరోపణ



**కోల్‌కతా, మే 9 (మన ప్రజాగళం):**
పశ్చిమ బెంగాల్‌లో తొలిసారి అధికారంలోకి వచ్చిన బీజేపీని ఎదుర్కొనేందుకు దేశవ్యాప్తంగా ఉన్న విపక్షాలన్నీ ఏకం కావాలని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలతో పాటు బీజేపీని వ్యతిరేకించే విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా కోల్‌కతాలోని కాళీఘాట్ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో మమత మాట్లాడారు. బీజేపీయే తమకు మొదటి శత్రువని, ఆ పార్టీని ఎదుర్కొనేందుకు ఎవరితోనైనా చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా టీఎంసీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని మమత ఆరోపించారు. బీజేపీ శ్రేణుల్లోకి సంఘ విద్రోహ శక్తులు ప్రవేశించి రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన వెంటనే తమకు కల్పించిన భద్రతను ఉపసంహరించుకున్నారని మమత ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా ఉన్న పలువురు విపక్ష నేతలు తనకు ఫోన్ చేసి సంఘీభావం తెలిపారని పేర్కొన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి రోజే టీఎంసీ కొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తోందని మమత ప్రకటించారు. భవిష్యత్తులో బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత స్థాయిలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో మమత తన ఓటమిని పరోక్షంగా అంగీకరించినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం కావడంతో ఆమె తన ఎక్స్ ఖాతా బయోను కూడా మార్చుకున్నారు. తన ఎక్స్ బయోలో "అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్, బంగాల్ ముఖ్యమంత్రి (15,16,17వ విధానసభ)" అని మార్చుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల జరిగిన ఎన్నికలపై కూడా మమత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము బీజేపీతో కాకుండా ఎన్నికల సంఘంతో పోరాడామని ఆరోపించారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని వ్యాఖ్యానించారు. ప్రజా తీర్పు వల్ల కాకుండా కుట్రల కారణంగానే తమ ఓటమి జరిగిందని మమత ఆరోపించారు. ఎన్నికల ఫలితాల తర్వాత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ తదితరులు తనకు ఫోన్ చేసి సంఘీభావం తెలిపారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇండియా కూటమిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని మమత స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక శక్తులను ఒక్క తాటిపైకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు.

# బెంగాల్‌లో మారుతున్న పాలన..

పోలీసుల ఎక్స్ ఖాతాల్లోనూ మార్పులు

- మమత, అభిషేక్‌లను అన్‌ఫాలో చేసిన కోల్‌కతా పోలీసులు
- కొత్త ప్రభుత్వ పెద్దలకు ప్రాధాన్యం
- సీఎం సువేందు అధికారి ప్రమాణ స్వీకారంతో మారిన రాజకీయ వాతావరణం



**కోల్‌కతా, మే 9 (మన ప్రజాగళం):**
పశ్చిమ బెంగాల్‌లో అధికార మార్పుతో ప్రభుత్వ వ్యవస్థల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కోల్‌కతా పోలీసులు తమ అధికారిక ఎక్స్ ఖాతాలో కీలక మార్పులు చేశారు. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీలను అన్‌ఫాలో చేసిన కోల్‌కతా పోలీసులు, కొత్త ప్రభుత్వానికి చెందిన ప్రముఖ నేతల ఖాతాలను ఫాలో అవడం ప్రారంభించారు. ప్రస్తుతం కోల్‌కతా పోలీసుల ఫాలో జాబితాలో నరేంద్ర మోదీ, సీఎం సువేందు అధికారి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి కార్యాలయం, హోంమంత్రి కార్యాలయం వంటి ఖాతాలు ఉన్నాయి. మొత్తం 42 ఖాతాలను ఫాలో అవుతున్న జాబితాలో మమత, అభిషేక్‌లకు స్థానం లేకపోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని బెంగాల్‌లో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. నందిగ్రామ్, భవానీపూర్ స్థానాల్లో విజయం సాధించిన సువేందు అధికారి రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. మరోవైపు సువేందు ప్రమాణ స్వీకారం అనంతరం మమతా బెనర్జీ తన సోషల్ మీడియా ఖాతాల నుంచి "ముఖ్యమంత్రి" హోదాను తొలగించడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇవాళ సువేందుతో పాటు మరో ఐదుగురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో మహిళా నేత అగ్నిమిత్రా పాల్ కూడా ఉన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం సువేందు అధికారి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో సుశాసనం, అభివృద్ధిపై దృష్టి పెట్టనున్నట్లు ప్రకటించింది.

# ఈడీ, సీబీఐలను కేంద్రం రాజకీయ ఆయుధాలుగా వాడుతోంది: కేజ్రీవాల్

- ప్రతిపక్ష నేతలను బెదిరించి బీజేపీలోకి చేర్చే ప్రయత్నమని ఆరోపణ
- పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరా ఇంటిపై ఈడీ దాడులపై తీవ్ర విమర్శలు
- పంజాబ్‌ను లక్ష్యంగా చేసుకుని కేంద్రం వేధింపులకు పాల్పడుతోందని మండిపాటు



**చండీగఢ్, మే 9 (మన ప్రజాగళం):**
ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులను లక్ష్యంగా చేసుకుని వారిని బీజేపీలో చేరాలని ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరా నివాసంలో ఈడీ సోదాలు జరిగిన నేపథ్యంలో కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈడీ, సీబీఐ వంటి సంస్థలను అవినీతి నిరోధానికి కాకుండా రాజకీయ ప్రత్యర్థులను బలహీనపర్చేందుకు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులను భయపెట్టి, కేసులతో ఇబ్బంది పెట్టి చివరకు బీజేపీలో చేరేలా చేయడమే ఈ దాడుల వెనుక అసలు ఉద్దేశమని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. సంజీవ్ అరోరాపై ఈడీ చర్యలు కూడా అదే వ్యూహంలో భాగమని ఆరోపించారు. సంజీవ్ అరోరాకు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు శనివారం విస్తృత సోదాలు నిర్వహించారు. రూ.100 కోట్ల మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఢిల్లీ, గురుగ్రామ్, చండీగఢ్ ప్రాంతాల్లోని ఐదు ప్రాంగణాల్లో దాడులు జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా గత నెలలో అశోక్ మిత్తల్ ఇంటిపై జరిగిన ఈడీ దాడులను కూడా కేజ్రీవాల్ ప్రస్తావించారు. ఈడీ సోదాలు జరిగిన మరుసటి రోజే అశోక్ మిత్తల్ బీజేపీలో చేరారని గుర్తుచేశారు. అంటే ఈడీ దాడుల అసలు లక్ష్యం అవినీతి బయటపెట్టడం కాదని, రాజకీయంగా ఒత్తిడి తెచ్చి బీజేపీలో చేర్చుకోవడమేనని ఆరోపించారు. సంజీవ్ అరోరా విషయంలో కూడా అదే పద్ధతి అనుసరిస్తున్నారని కేజ్రీవాల్ విమర్శించారు. కొద్ది రోజుల క్రితం కూడా ఆయన నివాసంలో సోదాలు జరిగాయని, అయినప్పటికీ ఆయన బీజేపీలో చేరకపోవడంతో మళ్లీ ఈడీ దాడులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే పంజాబ్‌లో ఈడీ దాడులు ప్రారంభమయ్యాయని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం పంజాబ్‌ను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. పంజాబ్ జలాల అంశం, పంజాబ్ యూనివర్సిటీపై నియంత్రణ ప్రయత్నాలు, గ్రామీణాభివృద్ధి నిధుల నిలిపివేత వంటి అంశాలను ప్రస్తావిస్తూ కేంద్రం రాష్ట్రంపై ఒత్తిడి పెంచుతోందన్నారు. ఇప్పుడు వరుస ఈడీ దాడులతో రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. పంజాబ్ గురువుల పుణ్యభూమి అని పేర్కొన్న కేజ్రీవాల్ చారిత్రక ఉదాహరణలను కూడా ప్రస్తావించారు. గతంలో ఔరంగజేబు అణచివేతకు గురువులు ఎలా ఎదురు నిలిచారో, ఇప్పుడు కూడా పంజాబ్ ప్రజలు అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడతారని అన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తోందని ఆరోపించిన కేజ్రీవాల్, ప్రతిపక్షాలను అణిచివేయడానికి కేంద్ర సంస్థలను వాడటం ప్రమాదకర పరిణామమని వ్యాఖ్యానించారు. పంజాబ్ ప్రజలు భయపడబోరని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

# గోవాలో విదేశీయుల నేరాలు ఆందోళనకరం

- బాధితుల కంటే నిందితులుగానే ఎక్కువ కేసులు
- డ్రగ్స్, మోసాలు, వీసా ఉల్లంఘనల్లో పెరుగుతున్న ప్రమేయం
- అక్రమ కార్యకలాపాలపై గోవా ప్రభుత్వ కఠిన చర్యలు




**గోవా, మే 9 (మన ప్రజాగళం):**
ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా పేరొందిన గోవాలో విదేశీయులకు సంబంధించిన నేరాల అంశం ఆందోళన కలిగిస్తోంది. విదేశీయులపై జరిగే నేరాల కంటే, వారే స్వయంగా పాల్పడుతున్న నేరాలు అధికంగా ఉన్నాయని జాతీయ నేర గణాంక సంస్థ నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2022 నుంచి 2024 మధ్యకాలంలో విదేశీయులు బాధితులుగా ఉన్న కేసులతో పోలిస్తే, నిందితులుగా నమోదైన కేసులు ఆరు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గోవాలో పెరుగుతున్న నేరాల ధోరణిపై ఈ వివరాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎన్సీఆర్బీ డేటా ప్రకారం గత మూడు సంవత్సరాల్లో గోవా పోలీసులు విదేశీయులకు సంబంధించిన మొత్తం 251 కేసులు నమోదు చేశారు. వీటిలో 206 కేసుల్లో విదేశీయులే నిందితులుగా ఉండగా, కేవలం 45 కేసుల్లో మాత్రమే వారు బాధితులుగా ఉన్నారు. ముఖ్యంగా 2024లో విదేశీయులు పాల్పడిన నేరాలు 27 శాతం పెరిగినట్లు అధికారులు గుర్తించారు. హత్యాయత్నం, అత్యాచారం, మోసం, దాడులు, ఫారినర్స్ యాక్ట్ ఉల్లంఘనలు, మాదకద్రవ్యాల అమ్మకం, రవాణా వంటి తీవ్రమైన నేరాల్లో విదేశీయుల ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఈ కేసుల్లో నైజీరియా, రష్యా, నేపాల్, టాంజానియా, బల్గేరియా, బంగ్లాదేశ్ దేశాలకు చెందిన పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీసా గడువు ముగిసినా అక్రమంగా నివసించడం, డ్రగ్స్ వ్యాపారం వంటి కార్యకలాపాల్లో ఎక్కువ మంది పట్టుబడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో గోవా ప్రభుత్వం చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే విదేశీయుల కోసం మపుసాలో ప్రత్యేక డిటెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. చట్టాన్ని ఉల్లంఘించిన విదేశీయులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు హెచ్చరించారు. శిక్షాకాలం పూర్తయిన తర్వాత ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ద్వారా వారిని తిరిగి వారి దేశాలకు పంపించే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పర్యాటక కేంద్రంగా ఉన్న గోవాలో శాంతిభద్రతలు కాపాడటానికి పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. విదేశీయుల కార్యకలాపాలపై మరింత కఠిన పర్యవేక్షణ అవసరమని భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఏబీ పీఎం-జే హ్యాకథాన్--2026 విజయవంతం

- ఆరోగ్య క్లెయిమ్‌ల పరిశీలనలో కృత్రిమ మేధకు ప్రాధాన్యం
- 3,500 మందికి పైగా పాల్గొన్న పోటీ
- విజేతలకు రూ. 5 లక్షల వరకు నగదు బహుమతులు
- డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ బలోపేతంపై చర్చలు



**న్యూఢిల్లీ, మే 9 (మన ప్రజాగళం):**
జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏబీ పీఎం-జే ఆటో అడ్జుడికేషన్ హ్యాకథాన్--2026 విజయవంతంగా ముగిసింది. ఇండియా ఏఐ మిషన్, బెంగళూరులోని భారత విజ్ఞాన సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య బీమా క్లెయిమ్‌ల పరిశీలనలో కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ హ్యాకథాన్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా 3,500 మందికి పైగా పాల్గొని తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించారు. నిపుణుల జ్యూరీ పరిశీలన అనంతరం అమలు చేయగలిగే ఉత్తమ కృత్రిమ మేధ పరిష్కారాలను ఎంపిక చేశారు. విజేత జట్లకు రూ. 5 లక్షల వరకు నగదు బహుమతులు అందజేశారు. ఎంపికైన పరిష్కారాలను ఏబీ పీఎం-జే పథకంలో అమలు చేసే దిశగా జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ ముందుకు సాగనుందని అధికారులు తెలిపారు. క్లెయిమ్‌ల పరిశీలనలో పారదర్శకత, భద్రత, మోసాల నివారణకు కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుందని సమావేశాల్లో నిపుణులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో డిజిటల్ ఆరోగ్య సేవలను మరింత విస్తరించేందుకు బలమైన సాంకేతిక వేదికలు అవసరమని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలు, భారతదేశానికి అనుగుణమైన ఆరోగ్య కృత్రిమ మేధ నమూనాల అభివృద్ధిపై ప్రత్యేక చర్చలు నిర్వహించారు. పరస్పర అనుసంధానంతో కూడిన డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ నిర్మాణంపై కార్యాచరణ రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. ఆరోగ్య సేవల్లో సాంకేతికత వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి హ్యాకథాన్‌లు వినూత్న పరిష్కారాలకు దోహదపడతాయని నిపుణులు అభిప్రాయపడ్డారు.



# తమిళనాడు రాజకీయాల్లో కొత్త ట్విస్ట్

టీవీకే మద్దతు లేఖపై వివాదం

ఫోర్జరీ ఆరోపణలు చేసిన దినకరన్

ప్రభుత్వ ఏర్పాటుపై రాజకీయ ఉత్కంఠ

**చెన్నై, మే 9 (మన ప్రజాగళం): :**
తమిళనాడు రాజకీయాల్లో ప్రభుత్వ ఏర్పాటు చుట్టూ ఉత్కంఠ నెలకొంది. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి మద్దతు వ్యవహారం కొత్త వివాదానికి దారితీసింది. అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం పార్టీ ఎమ్మెల్యే తమకు మద్దతు ఇచ్చినట్లు టీవీకే ప్రకటించగా, అది నకిలీ లేఖ అంటూ ఏఎంఎంకే తీవ్ర ఆరోపణలు చేసింది. టీటీవీ దినకరన్ నేతృత్వంలోని ఏఎంఎంకే నుంచి ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యే ఎస్ కామరాజ్ టీవీకేకు మద్దతు ఇస్తున్నట్లు ఓ లేఖ విడుదలైంది. లేఖపై కామరాజ్ సంతకం చేస్తున్న వీడియోను కూడా టీవీకే సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ లేఖను గవర్నర్‌కు కూడా సమర్పించినట్లు సమాచారం. అయితే ఆ లేఖ పూర్తిగా నకిలీదని దినకరన్ ఆరోపించారు. కామరాజ్ సంతకం చేస్తున్న వీడియోను కృత్రిమ మేధ సాయంతో సృష్టించారని పేర్కొన్నారు. తమ పార్టీ టీవీకేకు ఎలాంటి మద్దతు ప్రకటించలేదని స్పష్టం చేశారు. తమ ఏకైక ఎమ్మెల్యే కనిపించడం లేదని, ఆయనను రాజకీయ ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని దినకరన్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ప్రకటించిన ఆయన, గిండి రేంజ్ ఏసీపీ కార్యాలయానికి వెళ్లి అధికారికంగా ఫిర్యాదు చేశారు. మరోవైపు టీవీకే మాత్రం దినకరన్ ఆరోపణలను ఖండించింది. తాము ఎవరితోనూ బేరసారాలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. తమపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపించింది. ఈ పరిణామాల మధ్య దినకరన్ మరో కీలక అడుగు వేశారు. తమ ఎమ్మెల్యే కామరాజ్‌తో కలిసి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ను కలిసి, ఎడప్పాడి కే పళనిస్వామి నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని తెలిపారు. దీంతో తమిళనాడు రాజకీయాల్లో పరిస్థితులు మరింత ఆసక్తికరంగా మారాయి.

మన తెలుగు దిన పత్రిక ప్రజా గళం www.prajagalam.in

ఆదివారం 10 మే 2026

# ఓటరు జాబితాలో తప్పులు లేకుండా అప్రమత్తంగా పనిచేయాలి

- కేపీ వివేకానంద్
- ఎస్ఐఆర్‌పై బీఆర్ఎస్ అవగాహన సదస్సు
- బీఎల్ఏలు, నాయకులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే
- పార్టీ బలోపేతంపై కీలక సూచనలు



**హైదరాబాద్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 127వ డివిజన్ రంగారెడ్డి నగర్ ఆదర్శనగర్ కమ్యూనిటీ హాల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణ, పాటించాల్సిన నియమాలు, నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా నాయకులు, బీఎల్ఏలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. 2002 జనాభా ప్రాతిపదికన ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడం అత్యంత ముఖ్యమని వివేకానంద్ పేర్కొన్నారు. డూప్లికేట్ ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు, అసలు వ్యక్తులు లేని పేర్లతో నమోదైన ఓట్లను గుర్తించి తొలగించాల్సిన అవసరం ఉందన్నారు.

కుటుంబ సభ్యుల ఓట్ల మ్యాపింగ్, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులను సరిచేసే ప్రక్రియలో నాయకులు, బీఎల్ఏలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు, యువత బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, నూతన కమిటీల నియామకంపై కూడా ఆయన వివరించారు. పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులకు సూచనలు చేశారు. ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వివేకానంద్ పిలుపునిచ్చారు. గ్రామాలు, కాలనీలు, డివిజన్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, మాజీ డివిజన్ అధ్యక్షుడు ఎర్వ శంకరయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, మహిళా నాయకురాళ్లు, అనుబంధ సంఘాల సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాపాలన కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం

- వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- ధాన్యం సేకరణ, జనగణనపై కీలక సూచనలు
- అగ్రి స్టాక్, రైతు రిజిస్ట్రీపై సమీక్ష

**హైదరాబాద్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక, విద్యాశాఖ వారోత్సవాలు, ధాన్యం సేకరణ, అగ్రి స్టాక్--ఫార్మర్స్ రిజిస్ట్రీ, జనగణన--సెల్ఫ్ ఎన్యుమరేషన్ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రజాపాలన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ సకాలంలో ధాన్యం సేకరణ పూర్తి చేయాలని పేర్కొన్నారు. అగ్రి స్టాక్--ఫార్మర్స్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. జనగణనలో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. డిజిటల్ విధానాల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రా, వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ సుధారాణి, విద్యా, రవాణా,



మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇంటి పనివారి వివరాలు పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలి

- ఎస్పీ నితికా పంత్
- నేపాల్‌కు చెందిన వర్కర్ల నియామకంలో ప్రత్యేక అప్రమత్తత అవసరం
- గృహ యజమానులకు భద్రతపై కీలక సూచనలు
- పోలీస్ వెరిఫికేషన్ లేకుండా పనుల్లోకి తీసుకోవద్దని హెచ్చరిక



**ఆసిఫాబాద్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** ఇళ్లలో పనిచేసే వంట మనుషులు, సెక్యూరిటీ గార్డులు, డ్రైవర్లు, గృహ సహాయకుల వివరాలను తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ ప్రజలకు సూచించారు. ఇటీవల పలు ప్రాంతాల్లో గృహ సహాయకుల పేరుతో జరుగుతున్న నేరాల నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ప్రత్యేకంగా నేపాల్‌కు చెందిన వర్కర్ల నియామకంలో అత్యంత జాగ్రత్త అవసరమని ఎస్పీ హెచ్చరించారు. పనివారిని నియమించే ముందు వారి పూర్తి వివరాలు, ఆధార్, గుర్తింపు పత్రాలు, చిరునామాలు, ఫోన్ నంబర్లు సరిచూసుకోవాలని సూచించారు. పోలీస్ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాతే ఇంట్లో పనులకు అనుమతించాలని స్పష్టం చేశారు. ఇటీవల దేశంలోని పలు నగరాల్లో పనిమనుషుల పేరుతో ఇళ్లలోకి ప్రవేశించి దోపిడీలు, హత్యలు, చోరీలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని కొందరు నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఇంటి యజమానులు భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు.ఇళ్లలో పనిచేసే వ్యక్తుల గత చరిత్ర, పూర్వపు ఉద్యోగ వివరాలు తెలుసుకోవడం కూడా ఎంతో ముఖ్యమని ఎస్పీ తెలిపారు. మధ్యవర్తుల ద్వారా లేదా ఎటువంటి ధృవీకరణ లేకుండా పనివారిని నియమించుకోవడం ప్రమాదకరమని సూచించారు. గృహ యజమానులు తమ ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంట్లో ఒంటరిగా వృద్ధులు, మహిళలు ఉన్న సందర్భాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.పోలీస్ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రజల భద్రత కోసమేనని, దీనిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. ఇంటి పనివారి వివరాలు నమోదు చేయడం ద్వారా నేరాలను ముందుగానే అరికట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ఇప్పటికే పలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని వెల్లడించారు. కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, డ్రోన్ నిఘా, విజిబుల్ పోలీసింగ్ వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా అనేక నేరాలను నివారించవచ్చని ఎస్పీ నితికా పంత్ అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. భద్రతా అంశాల్లో ప్రజలు పోలీసులతో సమన్వయం చేసుకుంటేనే సమాజంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని ఎస్పీ స్పష్టం చేశారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రత్యేక కానుక



**హైదరాబాద్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** హనుమాన్ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందుకు మైనారిటీ నాయకులు ప్రత్యేక కానుకను బహుకరించారు. ఈ ఘటన మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది.కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో 125వ డివిజన్ గాజులరామారం సుభాష్ చంద్రబోస్ నగర్‌కు చెందిన మైనారిటీ నాయకుడు ఫయాజ్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాను స్వయంగా రూపొందించిన హనుమాన్ చిత్రపటాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు బహుకరించారు. మతాల మధ్య పరస్పర గౌరవం, సోదరభావం సమాజానికి ఎంతో అవసరమని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాట్లాడిన నాయకులు సమాజంలో ఐక్యత, సామరస్య వాతావరణం కొనసాగాలని ఆకాంక్షించారు. అన్ని మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హనుమాన్ జయంతి సందర్భంగా మైనారిటీ నాయకుడు హనుమాన్ చిత్రపటం అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ ఫయాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు అడ్వకేట్ కమలాకర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మతసామరస్యాన్ని బలోపేతం చేసే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

# వలస పక్షులను కాపాడటం మన అందరి బాధ్యత

- ప్రకృతి సమతుల్యతకు పక్షులు కీలకం
- కాలుష్యం, అడవుల నరికివేతతో పెరుగుతున్న ముప్పు
- పర్యావరణ పరిరక్షణలో సమాజం భాగస్వామ్యం అవసరం



**డెస్క్, మే 09 మన ప్రజాగళం న్యూస్ :** ప్రకృతి అందాలను మరింత సజీవంగా నిలబెట్టే జీవుల్లో పక్షులకు ప్రత్యేక స్థానం ఉంది. ఋతువులు మారే సమయంలో వేల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తూ ఒక దేశం నుంచి మరో దేశానికి వలస వెళ్లే పక్షులు ప్రకృతి వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తాయి. ప్రతి సంవత్సరం మే నెలలో నిర్వహించే "ప్రపంచ వలస పక్షుల దినోత్సవం" మనకు ఈ అరుదైన జీవుల ప్రాముఖ్యతను గుర్తు చేస్తోంది. కేవలం పక్షులను చూసి ఆనందించడమే కాదు, వాటి సంరక్షణ కూడా మన బాధ్యత అనే సందేశాన్ని ఈ ప్రత్యేక దినం అందిస్తోంది. వలస పక్షులు ప్రకృతిలో సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. పంటలకు హాని చేసే పురుగులను తిని వ్యవసాయానికి సహాయం చేయడం, విత్తనాలను వ్యాపింపజేసి అడవుల విస్తరణకు దోహదపడడం వంటి అనేక ప్రయోజనాలు వాటివల్ల కలుగుతాయి. చెరువులు, సరస్సులు, అటవీ ప్రాంతాలు ఆరోగ్యంగా ఉన్నాయా లేదా అన్నది కూడా వలస పక్షుల రాకతో అర్థమవుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. అందుకే పక్షుల సంరక్షణ అనేది కేవలం జంతు సంరక్షణ సమస్య మాత్రమే కాదు, అది పర్యావరణ భద్రతకు సంబంధించిన అంశం.అయితే ప్రస్తుతం వలస పక్షుల జీవనం తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటోంది. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, అడవుల నరికివేత, చెరువుల ఆక్రమణ, పారిశ్రామిక కాలుష్యం కారణంగా పక్షులకు సహజ నివాస ప్రాంతాలు తగ్గిపోతున్నాయి. ఒకప్పుడు వేల సంఖ్యలో కనిపించిన అనేక వలస పక్షులు ఇప్పుడు అరుదుగా మాత్రమే కనిపిస్తున్నాయి. పర్యావరణ మార్పుల ప్రభావంతో వాటి వలస మార్గాలు కూడా దెబ్బతింటున్నాయి. ఇది భవిష్యత్తులో జీవ వైవిధ్యానికి పెద్ద ప్రమాదంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెరువులు, సరస్సులు, తీరప్రాంతాలు వలస పక్షులకు ముఖ్యమైన ఆశ్రయ కేంద్రాలు. కానీ ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో ఈ నీటి వనరులు చెత్తతో నిండిపోతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయన కాలుష్యం కారణంగా పక్షులు ఆహారం దొరకక ఇబ్బందులు పడుతున్నాయి. కొన్నిసార్లు విషపూరిత పదార్థాలు తిని మరణిస్తున్న ఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. పర్యావరణాన్ని నాశనం చేస్తూ మనిషి చేస్తున్న తప్పుల ఫలితాన్ని మూగజీవులు అనుభవించడం బాధాకరం.వేట కూడా వలస పక్షులకు పెద్ద ముప్పుగా మారింది. కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా పక్షులను వేటాడటం ఇంకా కొనసాగుతూనే ఉంది. వినోదం కోసం, మాంసం కోసం పక్షులను చంపడం ప్రకృతిపై మనిషి చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. వలస పక్షులను రక్షించే చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో కఠినత్వం అవసరం. ప్రభుత్వాలు మాత్రమే కాదు, సమాజం కూడా ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలి. పిల్లల్లో ప్రకృతి పట్ల ప్రేమ పెంచాల్సిన అవసరం ఉంది. పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పక్షుల ప్రాముఖ్యతను తెలియజేయాలి. వలస పక్షులపై ప్రత్యేక ప్రదర్శనలు, ప్రకృతి యాత్రలు నిర్వహిస్తే చిన్నారుల్లో ప్రకృతి సంరక్షణ భావన పెరుగుతుంది. భవిష్యత్తు తరాలు పర్యావరణాన్ని కాపాడాలంటే ఇప్పటి నుంచే సరైన అవగాహన కల్పించాల్సి ఉంది.పక్షుల సంరక్షణలో స్థానిక ప్రజల పాత్ర కూడా ఎంతో కీలకం. గ్రామాల్లో చెరువులను పరిరక్షించడం, చెట్లు నాటడం, నీటి వనరులను శుభ్రంగా ఉంచడం వంటి చిన్నచిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దారితీస్తాయి. పట్టణాల్లోనూ పక్షులకు నీరు అందించే ఏర్పాట్లు చేయడం, చెట్లను సంరక్షించడం ద్వారా వాటికి అనుకూల వాతావరణం కల్పించవచ్చు. ప్రకృతిని కాపాడటం అంటే చివరకు మన జీవితాన్నే కాపాడుకోవడం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. వలస పక్షులు దేశాల మధ్య సరిహద్దులను దాటి ప్రయాణిస్తాయి. అందుకే వాటి సంరక్షణ ఒక దేశ బాధ్యత మాత్రమే కాదు, ప్రపంచ సమిష్టి కర్తవ్యం. అంతర్జాతీయ స్థాయిలో పలు ఒప్పందాలు, సంరక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ మరింత కట్టుదిట్టమైన చర్యలు అవసరం. పర్యావరణ పరిరక్షణను అభివృద్ధికి అడ్డంకిగా కాకుండా భవిష్యత్తు తరాల భద్రతగా చూడాల్సిన సమయం వచ్చింది.సాంకేతిక అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేస్తే చివరకు నష్టపోయేది మనుషులే. పక్షుల సంఖ్య తగ్గిపోవడం ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందనే హెచ్చరికగా భావించాలి. వలస పక్షులు కనిపించకుండా పోతే అది కేవలం ఒక జీవ జాతి అంతరించిపోవడం మాత్రమే కాదు, పర్యావరణ వ్యవస్థలో పెద్ద మార్పుకు సంకేతం. అందుకే ప్రకృతిని కాపాడే దిశగా ప్రభుత్వాలు, ప్రజలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వలస పక్షుల దినోత్సవం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తోంది. ప్రకృతితో కలిసి జీవించడం నేర్చుకోకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పక్షుల కిలకిలారావాలతో ప్రకృతి అందంగా ఉండాలంటే వాటి సంరక్షణను మన జీవన విధానంలో భాగం చేసుకోవాలి. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి రోజు పాటించాల్సిన బాధ్యతగా మారినప్పుడే వలస పక్షులకు నిజమైన రక్షణ లభిస్తుంది.

# బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు



**హైదరాబాద్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు భగీరథ్, ఓ బాలిక పరస్పరం పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకోవడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఇరుపక్షాల ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొంతమంది స్నేహితుల ద్వారా పరిచయమైన బాలిక డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తూ మానసికంగా వేధిస్తోందంటూ భగీరథ్ కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులపై కూడా ఫిర్యాదులో ఆరోపణలు చేసినట్లు సమాచారం.భగీరథ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించారు. మరోవైపు అదే రోజు రాత్రి బాలిక మల్కాజ్‌గిరి జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై ఫిర్యాదు చేసింది. గత డిసెంబర్ 31న మొయినాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భగీరథ్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక ఆరోపించింది. స్నేహితులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొంది.బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇరుపక్షాల ఆరోపణల నేపథ్యంలో ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు నమోదు చేయడంతో పాటు ఘటన జరిగిన ప్రదేశానికి సంబంధించిన ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన అంశాలపై పోలీసులు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# సాత్నాల ప్రాజెక్టు కాలువలో పూడికతీత పనుల ప్రారంభం

- మేడిగూడ సి-కాలువ వద్ద పూజలు నిర్వహించిన కలెక్టర్
- మరమ్మతులకు రూ. 69 లక్షలు మంజూరు
- త్వరలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడి



**ఆదిలాబాద్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** 'ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక' రైతు వారోత్సవాల్లో భాగంగా సాత్నాల మండల కేంద్రంలోని ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలో మేడిగూడ సి–కాలువ వద్ద చేపట్టనున్న పూడికతీత పనులను రాజర్షి షా ప్రారంభించారు. నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. రైతులకు సాగునీటి సరఫరా మెరుగుపడేందుకు కాలువల పూడికతీత పనులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం సాత్నాల ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్, ప్రాజెక్టు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ. 69 లక్షల నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు. త్వరలోనే మరమ్మతు పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తయితే సాగునీటి సరఫరా సామర్థ్యం పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుందని అధికారులు తెలిపారు. నీటిపారుదల సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ మహేష్, ఎంఆర్ఓ రామారావు, ఎంపీడీఓ వెంకట్ రాజు, ఏపీఓ వెంకటరమణ, సర్పంచ్ అంజనా బాయి పాల్గొన్నారు. అధికారులు, కూలీలు, స్థానిక ప్రజలు కూడా హాజరయ్యారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. కాలువల పూడికతీత, మరమ్మతుల పనులతో వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.





# కరీంనగర్ బంద్‌కు ప్రజల మద్దతు లభించింది: కౌశిక్ రెడ్డి

- ప్రభుత్వ వైఫల్యంపై ప్రజల నిరసన అన్న ఎమ్మెల్యే
- శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శ
- దాడులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**కరీంనగర్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** కరీంనగర్ బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇచ్చి ప్రభుత్వ వైఫల్యానికి గట్టి సమాధానం ఇచ్చారని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వరుస దొంగతనాలు, దాడుల ఘటనలు నిరూపిస్తున్నాయని విమర్శించారు. తనపై, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కార్యాలయంపై జరిగిన దాడులు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడులేనని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాల పేరుతో దాడులకు పాల్పడటం ఆందోళనకరమని అన్నారు. బంద్‌ను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేయించడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని ఆయన ఆరోపించారు. ప్రజల నిరసనలను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దాడులకు బాధ్యులైన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై కూడా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్‌లో ప్రజల్లో భద్రతాభావం తగ్గిపోయిందని ఆయన అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై తమ పార్టీ ఎప్పటికీ వెనక్కి తగ్గదన్నారు.



# బీసీ జనగణనకు మద్దతుగా దీక్షకు శ్రీనివాస్ గౌడ్ మద్దతు

- అంబర్‌పేటలో అమరణ దీక్షకు హాజరైన మాజీ మంత్రి
- ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీల లెక్కింపుకు డిమాండ్
- కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి



**హైదరాబాద్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో అంబర్‌పేటలో నిర్వహించిన అమరణ దీక్ష కార్యక్రమానికి మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు చేపట్టిన ఈ దీక్షలో పాల్గొన్న శ్రీనివాస్ గౌడ్, కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలతో పాటు బీసీ కుటుంబాలను కూడా లెక్కించాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభా, సామాజిక పరిస్థితులపై స్పష్టమైన సమాచారం సేకరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యాయం సాధనకు బీసీ జనగణన కీలకమని అభిప్రాయపడ్డారు. జనగణనలో అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీల హక్కులు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు సరైన గణాంకాలు అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీసీ జనగణన కోసం పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. సామాజిక సమానత్వం కోసం అన్ని వర్గాల లెక్కింపును పారదర్శకంగా నిర్వహించాలని దీక్షలో పాల్గొన్నవారు డిమాండ్ చేశారు.



# దొంగతనానికి వచ్చిన ఇద్దరికి స్థానికుల దేహశుద్ధి

- ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు
- కేకలు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు
- దొంగలను పోలీసులకు అప్పగింపు



**కామారెడ్డి, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ ఆఫీస్ సమీపంలో దొంగతనానికి ప్రయత్నించిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం ప్రకారం మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఓ ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. వారిని గమనించిన ఇంటి యజమాని భయంతో కేకలు వేయడంతో స్థానికులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. స్థానికులు ఇద్దరు వ్యక్తులను పట్టుకుని దేహశుద్ధి చేసినట్లు సమాచారం. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ఘటన సమయంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వివరాలు, ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం సేకరిస్తున్నారు. ఇటీవల ప్రాంతంలో దొంగతనాల ఘటనలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీస్ పహారా మరింత పెంచాలని కోరుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పట్టుబడిన వ్యక్తులపై గతంలో కూడా కేసులు ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

# మక్కలు అమ్ముకునేందుకు పోలీస్ స్టేషన్‌లో రైతుల నిరీక్షణ



**వరంగల్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మక్కలను విక్రయించేందుకు అవసరమైన బయోమెట్రిక్ అథెంటిఫికేషన్ కోసం రైతులు శుక్రవారం అర్ధరాత్రి వరకు రాయపర్తి పోలీస్ స్టేషన్ వద్దే పడిగాపులు కాశారు. ముఖ్యంగా మహిళా రైతులు రాత్రి వేళల్లో పోలీస్ స్టేషన్‌లోనే నిరీక్షించాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జాంబవ రైతు ఉత్పత్తిదారుల సంఘం నిర్వాహకులు రైతులతో దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులను అసభ్య పదజాలంతో దూషిస్తూ బయోమెట్రిక్ ప్రక్రియను మధ్యలోనే నిలిపివేసి వెళ్లిపోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి ఒంటిగంట వరకు వేచి చూసిన రైతులు చివరకు నిరాశతో ఇళ్లకు వెళ్లిపోయినట్లు సమాచారం. పంటను అమ్ముకునేందుకే ఇంత ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నదాతలు వాపోయారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, సరైన సమన్వయం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. వ్యవసాయాధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులకు గౌరవప్రదంగా సేవలు అందించాల్సిన అవసరం ఉందని రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. పంట విక్రయ ప్రక్రియను సులభతరం చేయాలని కోరుతున్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం వద్దు: కలెక్టర్ సత్యప్రసాద్

- కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- అకాల వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచన





**జగిత్యాల, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లాలోని ధర్మపురి మండలం పెద్ద నక్కలపేట, దోనూరు, తిమ్మాపూర్, వెల్గటూర్ మండలం శాఖాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని కలెక్టర్ హెచ్చరించారు. రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని కేంద్రాల నిర్వాహకులకు తెలిపారు. ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన వెంటనే డేటా ఎంట్రీ పూర్తి చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. మిల్లుల వద్ద త్వరగా అన్‌లోడింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో రైతులు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలవకుండా అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో మండల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హెల్త్

## కొబ్బరి చిప్పతో జుట్టు సంరక్షణ..

- మొక్కల పెంపకానికి ఉపయోగమే
- ఇంట్లో పనికిరాని వస్తువే ఇప్పుడు సహజ సంపద
- హెయిర్ కేర్ నుంచి గార్డెనింగ్ వరకు ఎన్నో ఉపయోగాలు
- పర్యావరణ హిత జీవనశైలిపై పెరుగుతున్న ఆసక్తి



సాధారణంగా కొబ్బరి వాడిన తర్వాత చాలామంది చిప్పను పనికిరాదని పారేస్తుంటారు. కానీ అదే కొబ్బరి చిప్ప ఇంటి అవసరాల నుంచి అందం, ఆరోగ్యం, గార్డెనింగ్ వరకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా సహజసిద్ధమైన జీవనశైలిపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో కొబ్బరి చిప్ప వినియోగం మళ్లీ ప్రాచుర్యం పొందుతోంది. పాతకాలంలో కొబ్బరి చిప్పను కాల్చి వచ్చిన బూడిదను జుట్టు సంరక్షణలో ఉపయోగించేవారని పెద్దలు చెబుతున్నారు. కొబ్బరి చిప్ప బూడిదను కొబ్బరి నూనెలో కలిపి తలకు రాస్తే చుండ్రు, దురద, జుట్టు రాలడం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉందని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. తల చర్మంపై పేరుకుపోయిన మలినాలను తొలగించి రక్తప్రసరణ మెరుగుపడేలా చేయడంలో ఇది సహాయపడుతుందని చెబుతున్నారు. కొబ్బరి చిప్ప బూడిదను మితంగా వాడితే జుట్టు మెత్తగా, మెరిసేలా కనిపిస్తుందని గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ నమ్మకం ఉంది. అయితే సున్నితమైన చర్మం ఉన్నవారు ముందుగా పరీక్షించి తర్వాత మాత్రమే ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇక గార్డెనింగ్‌లో కూడా కొబ్బరి చిప్పకు ప్రత్యేక స్థానం ఉంది. చిన్న మొక్కలు పెంచేందుకు ఇది సహజ కుండీలా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా అలంకార మొక్కలు, సక్యులెంట్స్, చిన్న పూల మొక్కలు నాటేందుకు కొబ్బరి చిప్పలను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ప్లాస్టిక్ కుండీలకు బదులుగా వీటిని వాడటం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి చిప్పలో చిన్న రంధ్రాలు చేసి మట్టి నింపి మొక్కలు నాటితే నీరు సులభంగా బయటకు వెళ్లి మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయని గార్డెనింగ్ నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి బాల్కనీ, టెర్రస్ గార్డెనింగ్‌లో ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కొబ్బరి చిప్పతో అలంకరణ వస్తువులు, కప్పులు, చిన్న బౌల్స్, క్రాఫ్ట్ వస్తువులు కూడా తయారు చేస్తున్నారు. చేతిపనుల కళాకారులు వీటితో ఆకర్షణీయమైన హస్తకళలను రూపొందిస్తూ ఆదాయం పొందుతున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రపంచవ్యాప్తంగా పిలుపు వస్తున్న సమయంలో సహజసిద్ధమైన కొబ్బరి చిప్ప వంటి పదార్థాల వినియోగం పెరగడం మంచి పరిణామమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంటి వద్ద అందుబాటులో ఉండే చిన్న వస్తువులను సృజనాత్మకంగా ఉపయోగించుకోవడం ద్వారా ఖర్చు తగ్గడంతో పాటు పర్యావరణానికి కూడా మేలు జరుగుతుందని సూచిస్తున్నారు.

## బ్రోకోలీతో ఆరోగ్యానికి బలమైన రక్షణ



ప్రస్తుతం ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో పోషకాహారానికి ప్రాధాన్యం అధికమవుతోంది. అలాంటి ఆరోగ్యకరమైన కూరగాయల్లో బ్రోకోలీ ఒకటి. ఆకుపచ్చ రంగులో కనిపించే ఈ కూరగాయలో అనేక రకాల జీవకణ పోషకాలు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండటంతో వైద్య నిపుణులు దీనిని తరచూ ఆహారంలో చేర్చాలని సూచిస్తున్నారు. బ్రోకోలీలో శరీరానికి అవసరమైన అనేక ముఖ్య పోషకాలు లభిస్తాయి. ఇందులో ఉండే జీవకణ బలపరిచే గుణాలు శరీర రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, ఉద్యోగులు తమ రోజువారీ ఆహారంలో దీనిని చేర్చుకుంటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ కూరగాయ గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా ఉపయోగపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. శరీరంలో హానికర కొవ్వు నిల్వలను తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. అలాగే జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. శరీర బరువు నియంత్రణ కోరుకునే వారు తక్కువ శక్తి విలువ కలిగిన ఈ కూరగాయను ఎక్కువగా తీసుకుంటున్నారు.అధిక మంటపై ఎక్కువసేపు వండితే ఇందులోని పోషక విలువలు తగ్గిపోయే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తక్కువ మంటపై ఉడికించడం లేదా ఆవిరి పద్ధతిలో వండడం ద్వారా మెరుగైన ప్రయోజనాలు పొందవచ్చని సూచిస్తున్నారు. సూపులు, వేపుడు, సలాడ్ల రూపంలో కూడా దీనిని ఆహారంగా తీసుకుంటున్నారు. ఇటీవల పట్టణ ప్రాంతాల్లో బ్రోకోలీ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడం, వ్యాయామం చేసే వారి సంఖ్య అధికమవడం వల్ల మార్కెట్‌లో దీనికి మంచి ఆదరణ లభిస్తోంది. రైతులు కూడా ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రోజువారీ ఆహారంలో పచ్చి కూరగాయలకు ప్రాధాన్యం ఇస్తే అనేక ఆరోగ్య సమస్యలను దూరం పెట్టవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అందులో బ్రోకోలీ మంచి ఆరోగ్య రక్షక ఆహారంగా నిలుస్తోందని చెబుతున్నారు.

## కార్న్ ఫ్లోర్ వంటలకు కొత్త రుచి.. ఆరోగ్యంపై కూడా ప్రభావం



**డెస్క్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** ప్రస్తుతం నగరాలు, పట్టణాల్లో ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి పెరుగుతున్న నేపథ్యంలో కార్న్ ఫ్లోర్ వినియోగం కూడా భారీగా పెరుగుతోంది. హోటళ్లు, రెస్టారెంట్లు మాత్రమే కాకుండా ఇళ్లలో కూడా అనేక వంటకాల తయారీలో కార్న్ ఫ్లోర్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. మొక్కజొన్న గింజలను ప్రత్యేక పద్ధతిలో పొడిచేసి తయారు చేసే ఈ పిండి వంటకాలకు ప్రత్యేకమైన రుచి, ఆకర్షణీయమైన రూపాన్ని అందిస్తుంది. ముఖ్యంగా పిల్లలు ఇష్టపడే ఫ్రై ఐటమ్స్‌లో కార్న్ ఫ్లోర్ వినియోగం ఎక్కువగా కనిపిస్తోంది. చికెన్ మంచూరియా, గోబీ మంచూరియా, ఫ్రెంచ్ ఫ్రైస్, పకోడీలు, స్ప్రింగ్ రోల్స్ వంటి వంటకాల తయారీలో కార్న్ ఫ్లోర్ కీలక పాత్ర పోషిస్తోంది. ఇతర పిండులతో పోలిస్తే ఇది వంటకాలపై పలుచని పొరలా ఏర్పడి కరకరలాడే టెక్స్చర్‌ను అందిస్తుంది. అందుకే హోటల్ స్టైల్ రుచి కోసం చాలామంది వంటల్లో కార్న్ ఫ్లోర్ కలుపుతున్నారు. సూపులు, గ్రేవీలు చిక్కగా తయారవ్వడానికి కూడా కార్న్ ఫ్లోర్ ఉపయోగపడుతుంది. తక్కువ పరిమాణంలో కలిపినా మంచి ఫలితం వస్తుండటంతో గృహిణులు దీనిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇటీవల బేకరీ ఉత్పత్తులు, స్నాక్స్ తయారీలో కూడా కార్న్ ఫ్లోర్ వినియోగం పెరిగింది. కేకులు, బిస్కెట్లు, నూడుల్స్, పాస్తా వంటి పదార్థాల్లో కూడా ఇది భాగమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయ వంటకాల తయారీలో కూడా కార్న్ ఫ్లోర్ ఉపయోగిస్తున్నారు. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించడంతో మధ్యతరగతి కుటుంబాల్లో దీని వినియోగం మరింత పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.ఆరోగ్య పరంగా చూస్తే కార్న్ ఫ్లోర్‌లో గ్లూటెన్ ఉండదు. దీంతో గోధుమ పదార్థాలు తినలేని వారు దీనిని ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్నారు. కొంతమంది ఆరోగ్య నిపుణులు దీనిని పరిమిత మోతాదులో తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. అయితే పూర్తిగా కార్న్ ఫ్లోర్ ఆధారిత ఆహారం తీసుకోవడం సరైన పద్ధతి కాదని హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే ఇందులో ప్రోటీన్, ఫైబర్ శాతం తక్కువగా ఉండటంతో శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అందవని చెబుతున్నారు. అధికంగా కార్న్ ఫ్లోర్‌తో తయారయ్యే ఫాస్ట్ ఫుడ్ పదార్థాలు తీసుకోవడం వల్ల ఊబకాయం, జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా నూనెలో వేయించిన పదార్థాలతో కలిపి తీసుకుంటే శరీరంలో కొవ్వు పెరిగే ప్రమాదం ఉంటుందని పేర్కొంటున్నారు. చిన్నపిల్లలకు తరచూ ఫ్రై ఐటమ్స్ ఇవ్వకుండా ఇంట్లో తయారుచేసిన ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని సూచిస్తున్నారు.మరోవైపు వేసవి కాలంలో కార్న్ ఫ్లోర్‌తో తయారయ్యే చల్లటి వంటకాలకు కూడా డిమాండ్ పెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో స్వీట్లు, పానీయాల్లో కూడా దీనిని ఉపయోగిస్తున్నారు. వంటకాలకు రుచి, ఆకర్షణ పెంచే కార్న్ ఫ్లోర్‌ను సరైన మోతాదులో వినియోగిస్తే ప్రయోజనకరమని నిపుణులు చెబుతున్నారు.

## జిలేబీ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?



సంప్రదాయ భారతీయ తీపి వంటకాలలో జిలేబీ ప్రత్యేక గుర్తింపు పొందింది. తీపి రుచి, కరకరలాడే స్వభావంతో చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టుకునే ఈ మిఠాయి ఆరోగ్యపరంగా కూడా కొన్ని ప్రయోజనాలు కలిగిస్తుందని ఆహార నిపుణులు చెబుతున్నారు. అయితే దీనిని పరిమితంగా తీసుకోవడం ముఖ్యమని సూచిస్తున్నారు. జిలేబీలో చక్కెర శాతం అధికంగా ఉండటం వల్ల ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. ఎక్కువసేపు శారీరక శ్రమ చేసినవారు లేదా అలసటగా ఉన్నవారు కొద్దిపాటి జిలేబీ తీసుకుంటే శక్తి పెరిగిన భావన కలుగుతుందని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉదయం పాలతో కలిసి జిలేబీ తీసుకునే అలవాటు ఇప్పటికీ కొనసాగుతోంది. తీపి పదార్థాలు మానసిక ఉల్లాసాన్ని పెంచడంలో కూడా సహాయపడతాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. జిలేబీ వంటి మిఠాయిలు తీసుకున్నప్పుడు మెదడులో ఆనంద భావనలు కలిగించే రసాయనాలు చురుకుగా పనిచేస్తాయని చెబుతున్నారు. అందువల్ల పండుగలు, శుభకార్యాల్లో జిలేబీకి ప్రత్యేక స్థానం ఉంది. అయితే అధికంగా జిలేబీ తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందులో తీపి, నూనె అధికంగా ఉండటంతో మధుమేహం, అధిక బరువు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు ఎక్కువగా తినకుండా పెద్దలు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఇంట్లో పరిశుభ్రంగా తయారు చేసిన జిలేబీ తీసుకోవడం మంచిదని ఆహార నిపుణులు సూచిస్తున్నారు. నాణ్యమైన నూనె, పరిశుభ్రమైన పదార్థాలతో తయారైన జిలేబీ రుచికరంగా ఉండటంతో పాటు ఆరోగ్యపరంగా కూడా కొంతమేర మేలు చేస్తుందని పేర్కొంటున్నారు. ఆహారంలో మితమే ఆరోగ్యానికి మేలని వైద్య నిపుణులు మరోసారి గుర్తు చేస్తున్నారు. అప్పుడప్పుడు పరిమితంగా జిలేబీ తీసుకోవడం ఆనందాన్ని ఇవ్వడమే కాకుండా తీపి రుచిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుందని చెబుతున్నారు.

# బిజినెస్

## రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు గ్లోబల్ గుర్తింపు



**న్యూఢిల్లీ, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** భారత మోటార్‌సైకిల్ తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రపంచవ్యాప్తంగా మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన ఆటోమొబైల్ బ్రాండ్ల జాబితాలో మూడో స్థానాన్ని దక్కించుకుని అంతర్జాతీయ స్థాయిలో తన ప్రభావాన్ని చాటింది. బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన "ఆటోమోటివ్ ఇండస్ట్రీ-2026" నివేదిక ప్రకారం టయోటా, బీఎండబ్ల్యూ తర్వాత రాయల్ ఎన్‌ఫీల్డ్ నిలిచింది. ఆడి, ఫెరారీ వంటి ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్లను వెనక్కి నెట్టడం విశేషంగా మారింది.ఈ నివేదికలో రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు బ్రాండ్ స్ట్రెంగ్త్ ఇండెక్స్‌లో 100కు 88.9 స్కోరు లభించగా, "ఏఏఏ" రేటింగ్ కూడా దక్కింది. గత ఏడాదితో పోలిస్తే సంస్థ బ్రాండ్ విలువ 30 శాతం పెరిగి 1.2 బిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్లడించింది.

ఒకప్పుడు కేవలం రెట్రో బైక్‌ల తయారీ సంస్థగా గుర్తింపు పొందిన రాయల్ ఎన్‌ఫీల్డ్, ఇప్పుడు ప్రపంచ మార్కెట్‌లో తనదైన ముద్ర వేస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ 80కు పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 3,200కుపైగా రిటైల్ కేంద్రాలను నిర్వహిస్తున్న సంస్థ, ఏడు అంతర్జాతీయ అసెంబ్లీ ప్లాంట్లతో తన ఉనికిని మరింత బలపరిచింది.యూరప్, దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియా ప్రాంతాల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లకు భారీ డిమాండ్ పెరుగుతోందని సంస్థ తెలిపింది. క్లాసిక్ డిజైన్‌తో పాటు సులభమైన ఇంజినీరింగ్, ప్రత్యేక రైడింగ్ అనుభూతి ఈ బ్రాండ్ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.హంటర్ 350, సూపర్ మీటియోర్ 650, హిమాలయన్ 450 వంటి మోడళ్లు యువతను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా అడ్వెంచర్ విభాగంలో హిమాలయన్ 450 మంచి ఆదరణ పొందుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.ఈ జాబితాలో భారతీయ ఆటో రంగానికి చెందిన ఇతర సంస్థలు కూడా ప్రాధాన్యం సంపాదించాయి. టాటా మోటార్స్ ఐదో స్థానంలో నిలవగా, మహీంద్రా 25వ స్థానం, మారుతీ సుజుకి 34వ స్థానాలను దక్కించుకున్నాయి. భారత ఆటోమొబైల్ రంగం అంతర్జాతీయంగా వేగంగా ఎదుగుతోందనే విషయానికి ఇవి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## ఎస్బీఐ లాభం రూ.19,684 కోట్లు




**ముంబై, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరపు చివరి త్రైమాసికంలో బ్యాంక్ ఏకీకృత నికర లాభం 6 శాతం పెరిగి రూ.19,684 కోట్లకు చేరింది.గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ లాభం రూ.18,643 కోట్లుగా నమోదుకాగా, ఈసారి స్వల్ప వృద్ధిని నమోదు చేసింది. అయితే బ్యాంక్ మొత్తం ఆదాయం మాత్రం తగ్గింది. గత ఏడాది రూ.1,43,876 కోట్లుగా ఉన్న ఆదాయం, ఈసారి రూ.1,40,412 కోట్లకు పడిపోయినట్లు వెల్లడించింది.త్రైమాసిక ఫలితాల అనంతరం ఎస్బీఐ షేర్లు మార్కెట్లో భారీ ఒత్తిడికి గురయ్యాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో బ్యాంక్ షేరు 6.62 శాతం పడిపోయి రూ.1,019.55 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కూడా 6.65 శాతం నష్టపోయి రూ.1,019.30 వద్ద స్థిరపడింది.దీంతో బ్యాంక్ మార్కెట్ విలువలో సుమారు రూ.66,691 కోట్ల మేర క్షీణత నమోదై, మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9.41 లక్షల కోట్లకు తగ్గింది.మరోవైపు బ్యాంక్ నిరర్థక ఆస్తుల విషయంలో మెరుగైన ఫలితాలు నమోదు చేసింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత ఏడాది 1.82 శాతం నుంచి 1.49 శాతానికి తగ్గింది. అలాగే నికర నిరర్థక ఆస్తులు 0.47 శాతం నుంచి 0.39 శాతానికి పడిపోయాయి.ఏకీకృత ప్రాతిపదికన చూస్తే, బ్యాంక్ రూ.1,81,079 కోట్ల ఆదాయంపై రూ.19,643 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. వాటాదారులకు ప్రతీ షేరుకు రూ.17.35 డివిడెండ్‌ను ప్రకటించినట్లు ఎస్బీఐ బోర్డు వెల్లడించింది.పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ రుణాల వృద్ధి 13 నుంచి 15 శాతం వరకు నమోదైందని బ్యాంక్ పేర్కొంది. అయితే అంతర్జాతీయ పరిస్థితులు మరింత కాలం కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

## బంధన్ బ్యాంక్ విస్తరణ

**హైదరాబాద్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ బంధన్ బ్యాంక్ తెలంగాణలో తన వ్యాపారాన్ని మరింత విస్తరించింది. రాష్ట్రంలో ఒకేసారి మూడు కొత్త శాఖలను ప్రారంభించినట్లు సంస్థ ప్రకటించింది.ఈ కొత్త శాఖల్లో రెండు హైదరాబాద్‌లో ప్రారంభించగా, మరో శాఖను మిర్యాలగూడలో ఏర్పాటు చేశారు. తాజా విస్తరణతో తెలంగాణలో బంధన్ బ్యాంక్ శాఖల సంఖ్య 162కు చేరుకుంది. దక్షిణ భారత మార్కెట్‌లో తమ ఉనికిని మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో ఈ విస్తరణ చేపట్టినట్లు బంధన్ బ్యాంక్ ఎండీ, సీఈవో పార్థ ప్రతీమ్ సేన్‌గుప్తా తెలిపారు.తెలంగాణతో పాటు తమిళనాడులో ఐదు శాఖలు, కేరళ మరియు కర్ణాటక రాష్ట్రాల్లో చెరో రెండు శాఖలను కూడా ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, కొత్త శాఖల ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించగలమని పేర్కొన్నారు.డిజిటల్ బ్యాంకింగ్ సేవలతో పాటు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో వినియోగదారులకు సులభంగా ఆర్థిక సేవలు అందించడంపై సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు బ్యాంక్ వర్గాలు తెలిపాయి.

## బంగారం ధరలు స్థిరం



**హైదరాబాద్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** గత కొన్ని రోజులుగా బంగారం ధరలు పెద్దగా మార్పులు లేకుండా స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో పసిడికి డిమాండ్ మాత్రం కొనసాగుతోంది. దీంతో బంగారం ధరలు లక్షన్నర రూపాయల సమీపంలోనే నిలకడగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం నాటికి హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,52,670గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల పది గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,39,940గా కొనసాగుతోంది.దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,52,870గా ఉండగా, 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,40,090గా నమోదైంది.ఇక వెండి ధరలు మాత్రం స్వల్పంగా పెరిగాయి. కిలో వెండిపై రూ.100 పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,74,800గా ఉంది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,75,100గా కొనసాగుతోంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,74,800గా ఉండగా, బెంగళూరులో రూ.2,75,100గా నమోదైంది.అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గుచూపడం వల్ల బంగారం ధరలు సమీప కాలంలో ఇదే స్థాయిలో కొనసాగే అవకాశముందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం



**న్యూఢిల్లీ, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థలు భారీ నష్టాలను భరిస్తున్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరిగినప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను స్థిరంగా ఉంచేందుకు ప్రభుత్వరంగ చమురు సంస్థలు భారీ ఆర్థిక భారం మోయాల్సి వస్తోంది. ప్రస్తుతం ఆయా సంస్థలకు రోజుకు సుమారు రూ.700 కోట్ల వరకు, నెలకు దాదాపు రూ.30 వేల కోట్ల మేర నష్టం వాటిల్లుతున్నట్లు సమాచారం.హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఏర్పడిన ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు సరఫరాపై ఆందోళనలు పెరిగాయి. దీంతో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లను దాటింది. అయినప్పటికీ దేశీయ వినియోగదారులపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం ధరలను నియంత్రిస్తోంది. అంతర్జాతీయంగా ధరలు పెరిగినా, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకుండా ప్రభుత్వరంగ చమురు సంస్థలే అదనపు వ్యయాన్ని భరిస్తున్నాయి. వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు పెట్రో ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని కూడా సుమారు పది శాతం మేర తగ్గించినట్లు తెలుస్తోంది.మరోవైపు ప్రపంచంలోని పలు దేశాల్లో చమురు ధరలు భారీగా పెరిగాయి. స్పెయిన్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు 34 శాతం వరకు పెరగగా, జపాన్, ఇటలీ, ఇజ్రాయెల్ దేశాల్లో 30 శాతం వరకు పెరుగుదల నమోదైంది. జర్మనీలో 27 శాతం, బ్రిటన్‌లో 22 శాతం మేర చమురు ధరలు పెరిగినట్లు అంతర్జాతీయ మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు మరింత తీవ్రతరమైతే, భవిష్యత్తులో దేశీయ మార్కెట్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పూజా ప్రేమ వార్తలు వైరల్



సినీ పరిశ్రమలో హీరోహీరోయిన్ల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన వార్తలు ఎప్పుడూ ఆసక్తిని రేకెత్తిస్తూనే ఉంటాయి. తాజాగా ప్రముఖ నటి పూజా హెగ్డేకు సంబంధించిన ప్రేమ వార్తలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస విజయాలతో అగ్ర కథానాయికగా గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే, ప్రస్తుతం సినిమాలకు కొంత విరామం ఇచ్చి వ్యక్తిగత జీవితంపై దృష్టి పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆమె బాలీవుడ్ నటుడు రోహన్ మెహ్రాతో ప్రేమలో ఉన్నారనే వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.రోహన్ మెహ్రా ప్రముఖ దివంగత నటుడు వినోద్ మెహ్రా కుమారుడు. ఇటీవల పలువురు సినీ కార్యక్రమాలు, వ్యక్తిగత వేడుకల్లో పూజా, రోహన్ కలిసి కనిపించడం ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది.ఇటీవల పూజా వెళ్లిన ఆధ్యాత్మిక యాత్రలో కూడా రోహన్ ఆమెతో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక చిత్రాలు బయటకు రాకపోయినా, సినీ వర్గాల్లో మాత్రం ఈ విషయంపై గట్టిగానే చర్చ నడుస్తోంది.సాధారణంగా తన వ్యక్తిగత విషయాలను చాలా గోప్యంగా ఉంచే పూజా హెగ్డే, గతంలో కూడా తనపై వచ్చిన ప్రేమ వార్తలపై ఎప్పుడూ స్పందించలేదు. అయితే ఈసారి రోహన్‌తో ఆమె సన్నిహితంగా కనిపిస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

## మనసు చెప్పిన దారిలోనే నడవాలి



సినీ నటి శోభిత ధూళిపాళ మరోసారి తన ఆలోచనలతో అందరి దృష్టిని ఆకర్షించారు. వ్యక్తిగత జీవితం, సినీ ప్రస్థానాన్ని సమతూకంగా కొనసాగిస్తూ ముందుకు సాగుతున్న ఆమె, తాజాగా మహిళల ఆత్మగౌరవం, స్వీయ నమ్మకం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.దుబాయ్‌కు చెందిన ప్రముఖ తెలుగు సామాజిక మాధ్యమాల ప్రభావశీలి శ్రీలత అడెపల్లి ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న తెలుగు మహిళలను అభినందిస్తూ ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఈ జాబితాలో శోభిత ధూళిపాళ పేరు కూడా చోటు దక్కడం విశేషంగా మారింది.ఈ సందర్భంగా స్పందించిన శోభిత, జీవితంలో మనం చేసే ప్రతి పని మన మనసు చెప్పిన దారిలోనే ఉండాలని అన్నారు. అలా చేసినప్పుడే జీవితంలోని ప్రతి క్షణం అర్థవంతంగా మారుతుందని పేర్కొన్నారు.ఇతరులను సంతోషపెట్టేందుకు కాకుండా, మనకు మనం నిజాయతీగా ఉండటం చాలా ముఖ్యమని ఆమె చెప్పారు. మనల్ని మనం గౌరవించుకోవడం ద్వారా నిజమైన ఆనందం లభిస్తుందని వ్యాఖ్యానించారు.మహిళలు ఒకరినొకరు ప్రోత్సహించుకోవాలని సూచించిన శోభిత, పరస్పర సహకారం ఉన్నప్పుడే సమాజంలో మహిళలు మరింత ఉన్నత స్థానాలకు ఎదగగలరని అభిప్రాయపడ్డారు.

## 'పెద్ది' కోసం భారీ ప్రణాళికలు






మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'పై అభిమానుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై మంచి ఆసక్తిని పెంచినా.. ప్రచార కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అభిమానుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.సామాజిక మాధ్యమాల్లో కూడా ఇదే అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇంత భారీ ప్రాజెక్ట్‌కు ఇంకా ప్రచారాన్ని వేగవంతం చేయకపోవడం ఏంటని అభిమానులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ విమర్శలకు సమాధానంగా చిత్ర బృందం భారీ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ప్రత్యేకంగా ఉత్తర భారత మార్కెట్‌పై దృష్టి పెట్టిన మేకర్స్.. అక్కడ సినిమాకు మరింత ప్రచారం తీసుకురావడానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం. సినిమాలో క్రికెట్ నేపథ్యం కూడా కీలక భాగంగా ఉండటంతో, ఆ క్రీడా భావోద్వేగాన్ని ప్రేక్షకులకు మరింత చేరువ చేయాలనే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది.ఈ నేపథ్యంలో ఝార్ఖండ్‌లోని రాంచీలో భారీ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశాలు ఉన్నాయని వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీని ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం ఈ విషయంపై చర్చలు మాత్రమే జరుగుతున్నాయని, ఇంకా ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి.అయితే ఈ వార్త బయటకు రావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. ఒకవేళ ధోనీ నిజంగానే ఈ కార్యక్రమానికి హాజరైతే 'పెద్ది' ప్రచారం ఒక్కసారిగా జాతీయ స్థాయిలో చర్చనీయాంశం అయ్యే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.'ఆర్ఆర్ఆర్' తర్వాత రామ్ చరణ్‌కు ఉత్తర భారతదేశంలో భారీ గుర్తింపు లభించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే క్రేజ్‌ను ఉపయోగించుకుని 'పెద్ది' చిత్రాన్ని దేశవ్యాప్తంగా మరింత బలంగా తీసుకెళ్లాలని చిత్ర బృందం వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది.క్రీడల నేపథ్యంతో పాటు గ్రామీణ వాతావరణం, బలమైన భావోద్వేగాలు, భారీ యాక్షన్ అంశాలతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గతంలో 'ఉప్పెన'తో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు బుచ్చిబాబు సానాపై కూడా ప్రేక్షకుల్లో మంచి నమ్మకం ఉండటంతో 'పెద్ది'పై అంచనాలు మరింత పెరుగుతున్నాయి.

## కల్కి' రెండో భాగంపై భారీ అంచనాలు




దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన విజువల్ ఫాంటసీ చిత్రం 'కల్కి 2898 ఏడీ' ప్రపంచవ్యాప్తంగా ఘన విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. భారీ వసూళ్లతో పాటు ప్రేక్షకుల ప్రశంసలు దక్కించుకున్న ఈ సినిమా ముగింపులో రెండో భాగానికి ఇచ్చిన సంకేతాలు అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచాయి.తాజాగా 'కల్కి' రెండో భాగానికి సంబంధించిన చిత్రీకరణ, విడుదలపై సినీ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. ప్రస్తుతం కీలక సన్నివేశాల చిత్రీకరణ వేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. మొదటి భాగం నిర్మాణ సమయంలోనే కొన్ని ముఖ్యమైన ఘట్టాలను దర్శకుడు నాగ్ అశ్విన్ చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు మిగిలిన భాగాన్ని పూర్తి చేసే పనిలో చిత్ర బృందం నిమగ్నమైందని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.వచ్చే ఏడాది ద్వితీయార్థం నాటికి చిత్రీకరణ పూర్తిచేయాలనే లక్ష్యంతో బృందం పనిచేస్తోందని సమాచారం. ఇదే సమయంలో దృశ్య ప్రభావాల పనులు కూడా సమాంతరంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగంలో మరింత భారీ స్థాయిలో దృశ్య వైభవం ఉండబోతుందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## డోపింగ్ పరీక్షలకు గైర్హాజరు..

### - జైస్వాల్, షఫాలీకి నోటీసులు




**న్యూఢిల్లీ, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** భారత క్రికెటర్లు యశస్వి జైస్వాల్, షఫాలీ వర్మలకు జాతీయ యాంటీ డోపింగ్ సంస్థ నోటీసులు జారీ చేసింది. గత ఏడాది నిర్వహించిన డోపింగ్ పరీక్షలకు హాజరుకాకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. డోపింగ్ పరీక్షలకు ఎందుకు హాజరుకాలేదనే విషయంపై ఇప్పటివరకు ఇద్దరు ఆటగాళ్లు ఎలాంటి వివరణ ఇవ్వలేదని జాతీయ యాంటీ డోపింగ్ సంస్థ తెలిపింది. ఈ నేపథ్యంలో అధికారిక నోటీసులు జారీ చేసినట్లు పేర్కొంది.యశస్వి జైస్వాల్, షఫాలీ వర్మ ఇద్దరూ రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్‌లో భాగంగా ఉన్నారు. ఈ జాబితాలో ఉన్న క్రీడాకారులు నిర్ణీత సమయాల్లో డోపింగ్ పరీక్షలకు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది.ఈ అంశంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి, అంతర్జాతీయ క్రికెట్ మండలికి కూడా సమాచారం ఇచ్చినట్లు యాంటీ డోపింగ్ సంస్థ వెల్లడించింది. నోటీసులు అందిన విషయాన్ని బీసీసీఐ వర్గాలు కూడా ధృవీకరించాయి.

ఒలింపిక్ క్రీడల్లో క్రికెట్‌కు చోటు లభించిన నేపథ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని డోపింగ్ నిబంధనలు కఠినంగా అమలు చేయాల్సి ఉంటుందని బీసీసీఐ అధికారులు పేర్కొన్నారు.ప్రస్తుతం యశస్వి జైస్వాల్ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాజస్థాన్ జట్టు తరపున ఆడుతుండగా, షఫాలీ వర్మ భారత మహిళల జట్టులో కీలక ఆటగాళ్లలో ఒకరిగా కొనసాగుతున్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో కూడా షఫాలీ పాల్గొన్నారు.నిబంధనల ప్రకారం వరుసగా మూడు సార్లు డోపింగ్ పరీక్షలకు గైర్హాజరవుతున్న క్రీడాకారులపై నిషేధం విధించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం జాతీయ యాంటీ డోపింగ్ సంస్థ రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్‌లో 13 మంది భారత క్రికెటర్లు ఉన్నారు.ఇటీవల ఈ జాబితాలో అభిషేక్ శర్మ, అక్షర్ పటేల్ కూడా చేరినట్లు సమాచారం. గతంలో నిషేధిత ఉత్ప్రేరక పదార్థం వినియోగించిన కేసులో భారత క్రికెటర్ పృథ్వీ షాపై ఎనిమిది నెలల నిషేధం విధించిన విషయం తెలిసిందే.

## వినేశ్ పోగట్‌కు షోకాజ్ నోటీసులు



**న్యూఢిల్లీ, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** భారత స్టార్ రెజ్లర్ వినేశ్ పోగట్‌కు భారతీయ రెజ్లింగ్ సమాఖ్య షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్రమశిక్షణా ఉల్లంఘనలు, యాంటీ డోపింగ్ నిబంధనలను పాటించకపోవడం వంటి ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాఖ్య వెల్లడించింది.వినేశ్ పోగట్‌పై మొత్తం నాలుగు ప్రధాన ఆరోపణలు చేసిన సమాఖ్య, వాటిపై వివరణ ఇవ్వాలని కోరింది. ఈ మేరకు 15 పేజీల నోటీసును జారీ చేసింది. ఆమె ప్రవర్తన వల్ల భారత రెజ్లింగ్ ప్రతిష్ఠ దెబ్బతిన్నట్లు సమాఖ్య పేర్కొంది. 2024 ఒలింపిక్స్ సమయంలో బరువు పరిమితి కారణంగా అనర్హతకు గురైన అంశం, యాంటీ డోపింగ్ నిబంధనల ఉల్లంఘన, అలాగే 2024 మార్చిలో జరిగిన సెలక్షన్ ట్రయల్స్‌లో రెండు విభాగాల్లో పాల్గొనడం వంటి విషయాలపై వివరణ ఇవ్వాలని కోరింది.ఈ నేపథ్యంలో జూన్ నెల వరకు వినేశ్ పోగట్ ఎలాంటి దేశీయ టోర్నీల్లో పాల్గొనడానికి అర్హురాలు కాదని సమాఖ్య స్పష్టం చేసింది. మే 10 నుంచి 12 వరకు గోండాలో జరగనున్న జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో కూడా ఆమెకు అనుమతి లేదని తెలిపింది.షోకాజ్ నోటీసుపై 14 రోజులలోగా సమాధానం ఇవ్వాలని సమాఖ్య ఆదేశించింది. వినేశ్ స్పందన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## ఆరెంజ్, పర్పుల్ క్యాప్ రేసులో హోరాహోరీ

**హైదరాబాద్, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది. ప్లేఆఫ్స్ పోరు ఎంత ఆసక్తికరంగా సాగుతుందో, వ్యక్తిగత రికార్డుల కోసం ఆటగాళ్ల మధ్య పోటీ కూడా అదే స్థాయిలో ఉత్కంఠ రేపుతోంది. ముఖ్యంగా అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌కు ఇచ్చే ఆరెంజ్ క్యాప్, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు ఇచ్చే పర్పుల్ క్యాప్ కోసం గట్టి పోటీ నెలకొంది.ఈ సీజన్‌లో బ్యాటింగ్ విభాగంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు ఆధిపత్యం చాటుతున్నారు. ప్రస్తుతం అత్యధిక పరుగులు చేసిన తొలి ఐదుగురు బ్యాటర్లలో ముగ్గురు హైదరాబాద్ జట్టుకు చెందినవారే కావడం విశేషం.హెన్రిచ్ క్లాసెన్ 494 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతూ ఆరెంజ్ క్యాప్‌ను నిలబెట్టుకున్నాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ 475 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. ఢిల్లీ జట్టుకు చెందిన కేఎల్ రాహుల్ 468 పరుగులతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.కోల్‌కతాతో జరిగిన కీలక మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ పెద్ద ఇన్నింగ్స్ ఆడితే అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉండగా, కేవలం 23 పరుగులకే పరిమితమవడంతో ఆ అవకాశాన్ని కోల్పోయాడు.ఇక సన్‌రైజర్స్‌కు చెందిన ఇషాన్ కిషన్ 409 పరుగులతో నాలుగో స్థానంలో ఉండగా, రాజస్థాన్ రాయల్స్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ 404 పరుగులతో ఐదో స్థానంలో నిలిచి ఆకట్టుకుంటున్నాడు.బౌలింగ్ విభాగంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ 17 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో ముందంజలో ఉన్నాడు. చెన్నై జట్టుకు చెందిన అన్షుల్ కాంబోజ్ కూడా 17 వికెట్లు తీసినప్పటికీ, మెరుగైన ఎకానమీ రేటు కారణంగా భువనేశ్వర్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.లక్నో జట్టుకు చెందిన ప్రిన్స్ యాదవ్, గుజరాత్ టైటాన్స్ స్టార్ పేసర్ కగిసో రబడా చెరో 16 వికెట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.తాజాగా ఢిల్లీ, కోల్‌కతా మధ్య జరిగిన మ్యాచ్ అనంతరం బౌలింగ్ పట్టికలో మార్పులు చోటుచేసుకున్నాయి. కోల్‌కతా ఫాస్ట్ బౌలర్ కార్తీక్ త్యాగి రెండు వికెట్లు పడగొట్టి తొలి పది మంది జాబితాలోకి చేరాడు. ప్రస్తుతం అతను 13 వికెట్లతో ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు.లీగ్ దశ ముగిసేలోపు ఆరెంజ్, పర్పుల్ క్యాప్ జాబితాల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.




## చెన్నై జట్టు ఎంపికపై బద్రీనాథ్ అసంతృప్తి



**చెన్నై, మే 9 మన ప్రజాగళం న్యూస్ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ తీసుకుంటున్న జట్టు ఎంపిక నిర్ణయాలు చర్చనీయాంశంగా మారాయి. భారీ మొత్తాలకు కొనుగోలు చేసిన ఆటగాళ్లకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ జట్టు మాజీ ఆటగాడు సుబ్రహ్మణ్యం బద్రీనాథ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై విజయం సాధించినప్పటికీ, జట్టు ఎంపిక తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా మంచి ఫామ్‌లో ఉన్న వెస్టిండీస్ స్పిన్నర్ అఖీల్ హోసేన్‌ను పక్కన పెట్టి, రూ.14.20 కోట్లు వెచ్చించి తీసుకున్న ప్రశాంత్ వీర్‌కు అవకాశం ఇవ్వడాన్ని ఆయన తప్పుబట్టారు.తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన బద్రీనాథ్, ఆటగాళ్ల ప్రతిభ కంటే వారి ధరను బట్టి అవకాశాలు ఇస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మ్యాచ్ గెలిచినంత మాత్రాన ప్రతి నిర్ణయం సరైందని భావించకూడదన్నారు.ప్రత్యేకంగా పవర్ ప్లే సమయంలో అనుభవం లేని బౌలర్‌తో బౌలింగ్ చేయించడం వ్యూహాత్మకంగా సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లలో ఆరు వికెట్లు తీసిన అఖీల్ హోసేన్ వంటి ఫామ్‌లో ఉన్న బౌలర్‌ను పక్కన పెట్టడం ఆశ్చర్యకరమన్నారు.ముంబైతో జరిగిన మ్యాచ్‌లో ప్రశాంత్ వీర్ రెండు ఓవర్లలో 25 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడని గుర్తు చేశారు. గతంలో ఐపీఎల్ అనుభవం కూడా పెద్దగా లేని ఆటగాడికి కీలక సమయంలో ఓవర్లు ఇవ్వడం సరైన వ్యూహం కాదన్నారు.అయితే మరోవైపు చెన్నై భారీ మొత్తం వెచ్చించి తీసుకున్న కార్తీక్ శర్మ మాత్రం తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతను తన ఐపీఎల్ కెరీర్‌లో తొలి అర్ధ సెంచరీ నమోదు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.ప్రతిభ కంటే ధరకు ప్రాధాన్యత ఇస్తే భవిష్యత్తులో జట్టు సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.